J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 29 19.12.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# ఒక రథం.. ఇద్దరు సారథులు



## రాజధానిలో.. రసవత్తర రాజకీయం

- సామాజిక సుడిగుండంలో అమరావతి అభివృద్ధి
- బరువు, బాధ్యత నారాయణది.. పేరు, పెత్తనం పెమ్మసానిది!

**విభజిత ఆంధ్రాలో చంద్రబాబునాయుడు రెండవ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత, మెరుపు వేగంతో పరుగులు పెడుతున్న రాజధాని అమరావతి ఇప్పుడు సామాజిక సుడిగుండంలో చిక్కు కుందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అటు రాజకీయశ్రేణులలోనూ, ఇటు అధికారవర్గాలలోనూ గత కొన్ని రోజులుగా ఈ అంశం హాట్‌టాపిక్‌గా మారింది. ఒకే రథాన్ని ఇద్దరు సారథులు నడపడం సాధ్యమేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.**

వివరాల్లోకి వెళ్తే...

'పొంగూరు నారాయణ'... ముఖ్యమంత్రి చంద్రబాబు తర్వాత ఆంధ్ర రాజధాని అమరావతికి ఈ పేరు ఓ బ్రాండ్. గతంలోనూ ఇప్పుడూ రాష్ట్రమున్సిపల్ శాఖ మంత్రిగా కంటే కూడా రాజధాని రూపశిల్పిగా నారాయణ ప్రసిద్ధి. అమరావతి పరిసర ప్రాంత వాసులకి సుపరిచితం.

2లో




3లో







3లో



GVK SCHOOL
NELLORE
SRI KASTURIDEVI VIDYALAYAM
RC.No.: 281925100005SPS Nellore2025, Dated: 28-Feb-2025

EMPOWERING EVERY STUDENT TO SUCCEED

GVK Co-Ed School begins a new era in education by offering global standard teaching that makes students future-ready. A holistic approach that focuses on all-round development ensures that every child's potential is discovered and nurtured with care. Driving the school's mission is its experienced faculty, state-of-the-art facilities and an encouraging learning environment.

- CBSE CURRICULUM
- FOCUS ON ENGLISH COMMUNICATION
- SAFE CO-ED CAMPUS
- ADVANCED INFRASTRUCTURE

ADMISSIONS OPEN
+91 90324 17700
Nursery - 8th Grade

To explore career opportunities,
send resumes to careers@gvkschool-nellore.in

GVK School
CXRF+24F, Beside KVR Petrol bunk, Santhi Nagar, Nellore - 524 003 | www.gvkschool-nellore.in

# ఒక రథం.. ఇద్దరు సారథులు

(మొదటిపేజీ తరువాయి)

2014–19 కాలం మధ్య, మళ్ళీ 2024 జూన్ నుండి నేటివరకూ అమరావతే తన ధ్యాస, శ్వాస అన్నట్లుగా నారాయణ పరిశ్రమించడం, పరితపించడమే దీనికి ప్రధాన కారణం. ఆనాటి భూసేకరణ, సీఆర్‌డీఏ ఆవిర్భావం నుండి మొదలుకుని, మళ్ళీ గత ఏడాది రాజధాని పనుల పునః ప్రారంభం చేసే వరకూ అన్నీతానై, అంతా తానై ముందుండి నడిపించిన నేతగా నారాయణకు పేరుంది. ప్రతి అణువు లోనూ నారాయణ శ్రమ కూడా వుంది. చంద్రబాబు పాలన తొలిదశ ఐదేళ్లతో పాటూ రెండో దశలో ఏడాదిన్నరకాలంగా అమరావతి సమస్యల పరిష్కారం కోసం నారాయణ నిరంతరం తపిస్తున్నారు. ఒక్కొక్క అడ్డంకిని తొలగించుకుని, తనదైన శైలిలో రాజధాని నిర్మాణంలో వేగాన్ని పెంచారు. అన్ని ఇబ్బందులు తొలిగి ప్రస్తుతం అమరావతి పనులు బుల్లెట్ స్పీడుతో పట్టాలెక్కుతున్నాయంటే దానికి ముఖ్య కారణం మంత్రి నారాయణే. ఎవరు అవునన్నా ఎవరు కాదన్నా ఇది జగమెరిగిన సత్యం.

అయితే క్రమేణా రాజధాని రాచరికాన్ని సంతరించుకుంటున్న తరుణంలో, అకస్మాత్తుగా త్రిసభ్య కమిటీ తెరపైకి వచ్చింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కమిటీ ఏర్పడింది. అనూహ్యంగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెరముందుకు వచ్చారు. పెమ్మసానితో పాటు నారాయణ, స్థానిక శాసన సభ్యుడు శ్రావణ్‌కుమార్ ఈ కమిటీలో సభ్యులుగా వున్నారు. అయితే, ఎవరూ ఊహించని తరహాలో రాజధాని నిర్మాణంలో ముఖ్యపాత్ర తనదే అనే సంకేతాలు వచ్చేలా పెమ్మసాని పావులు కదుపుతుండడం, ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. లోతుగా పరిశీలిస్తే సామాజిక సమీకరణలే ఈ త్రిసభ్య కమిటీ ఏర్పాటుకి మూల కారణం అన్న అభిప్రాయం విశ్లేషకుల నుండి వ్యక్తమౌతోంది. ఇన్నాళ్ళు నారాయణ పడ్డ కష్టానికి వస్తున్న గుర్తింపుని చూసి ఓర్వలేకపోతున్న కమ్మ సామాజికవర్గం, రాజధాని వ్యవహారంలో నారాయణ ప్రాభవాన్ని తగ్గించే ఆలోచనతోనే పెమ్మసానిని ముందుపెట్టి కథ నడిపిస్తోందనే మాట సర్వత్రా వినిపిస్తోంది. మొత్తానికి రాజధాని అమరావతి కథ కమ్మ, కాపుల మధ్య రసవత్తరంగా సాగుతోందన్న చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాలలో చక్కర్లు కొడుతోంది.

### అమరావతికి ఆద్యుడిగా.. అన్నదాతలకు ఆప్తుడిగా!

విజయవాడ, గుంటూరు నగరాల మధ్య 2015 అక్టోబర్ 22న విజయదశమి రోజున ఉద్దండరాయునిపాలెం వద్ద ప్రధాని నరేంద్ర మోడి తొలిసారి అమరావతికి శంకుస్థాపన చేశారు. ఆంధ్రప్రదేశ్ పరిపాలనా భవన సముదాయానికి 2016 అక్టోబర్ 16న అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఎం.వెంకయ్యనాయుడు కొబ్బరికాయ కొట్టారు. అప్పటినుంచి మున్సిపల్ శాఖ మంత్రిగా, అమరావతి పనుల పర్యవేక్షణ సారథిగా, ఏపీ సీఆర్‌డీఏ (ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతీయ అభివృద్ధి సంస్థ) పనులకు సారథ్యం వహిస్తూ మంత్రి నారాయణ అచంచలమైన పట్టుదల, దీక్షతో రాజధాని పనులను వేగవంతం చేశారు. ఈక్రమంలో తొలి దశలో భూ సమీకరణలో భాగంగా 33వేల ఎకరాల భూములిచ్చిన రైతులతో ఎప్పటికప్పుడు చర్చించారు. కేవలం రెండు నెలల వ్యవధిలో ఈ వ్యవహారం మొత్తం ఒంటి చేత్తో చక్కబెట్టి సీఎం చంద్రబాబు నుంచే కాకుండా రాష్ట్ర ప్రజల నుంచి కూడా ప్రశంసలందుకున్నారు. రూ.10వేల కోట్లతో రాజధాని పనులను పరుగులు పెట్టించారు. సింగపూర్, జపాన్ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న వివిధ ఒప్పందాలకు సాక్షీభూతంగా నిలిచారు. అయితే, ఆ తర్వాత వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల నినాదం అందుకోవడం, రైతుల ఆందోళనలు పెరగడం, పెట్టుబడిదారులు అమరావతి నుంచి వెళ్లిపోవడం, పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లులు మంజూరు కాకుండా నానా అవస్థలు పడడం చకచకా జరిగిపోయాయి. ఇదే సమయంలో అమరావతి పేరుతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం, ఆ పార్టీకి చెందిన నాయకులు తెలుగుదేశంలో కేవలం నారాయణనే టార్గెట్ చేస్తూ తీవ్ర విమర్శలు చేశారు. ఒకదశలో అమరావతి అనే రియల్ ఎస్టేట్ వెంచర్‌కు అప్పటి మంత్రి నారాయణ వాచ్‌మెన్ అంటూ ఎద్దేవా చేశారు. చంద్రబాబు భూ దోపిడీకి నారాయణ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారంటూ హేళన చేశారు. ప్రశ్నాపత్రం లీకేజీ వంటి సిల్లీ కేసులో ఇరికించి నారాయణని జైలుకి పంపాలని కూడా చూశారు. వీటన్నిటిని ఎదుర్కొని ధైర్యంగా ఆయన నిలబడ్డారు. పార్టీని తిరిగి అధికారంలోకి తేవడానికి తనవంతు శ్రమించారు.

రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అమరావతి పునర్ నిర్మాణ పనుల బాధ్యతని చంద్రబాబు మళ్ళీ నారాయణకే అప్పజెప్పారు. ఆ క్షణం నుండి అమరావతి అభివృద్ధే లక్ష్యంగా నారాయణ శ్రమిస్తున్నారు. ముఖ్యంగా ఈ ఏడాది మేలో ప్రధాని మోడి చేతుల మీదుగా అమరావతి పనులను తిరిగి ప్రారంభింపజేయడంలో కీలకపాత్ర పోషించారు. ఈ క్రమంలో ఓ వైపు కాంట్రాక్టర్లు, మరోవైపు టెండర్లు, ఇంకోవైపు రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నారు. తాజాగా రెండోదశ భూ సేకరణకు సంబంధించి మరో 20 వేల పైచిలుకు ఎకరాలను రైతుల నుంచి రాజధాని కోసం సేకరించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. కోర్టు కేసులు వేసిన వారితో ఎప్పటికప్పుడు చర్చించి అమరావతి పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వర్షాల సమయంలోనూ పనులు నిలిచి పోకుండా కాలికి బలపం కట్టుకుని పనిచేస్తున్నారు.

### త్రిసభ్య కమిటీతో వేగానికి సంకెళ్లు!

రాజధాని అమరావతి కోసం అన్నీ తానై వాయువేగంతో ముందుకు సాగుతున్న నారాయణకి ప్రభుత్వం వేసిన త్రిసభ్య కమిటీ బ్రేక్ వేసిందనే చర్చ ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో జోరందుకుంది. నిజానికి రాజధాని ప్రాంతంలోని జరీబు–మెట్ట భూముల అంశం, గ్రామకంఠాలు, అసైన్డ్, లంక భూములకు సంబంధించి కొన్ని చిన్న సమస్యలున్నాయి. వాటన్నిటినీ పరిష్కరించే నెపంతో చంద్రబాబు ప్రభుత్వం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో ఓ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు రాజధాని రైతులతో చర్చలు జరిపి వారి ఇబ్బందులని తొలగించడంతో పాటూ రెండో విడత భూ సేకరణకు మార్గం సుగమం చేసేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే గతంలో ఐదేళ్లు, ప్రస్తుతం ఏడాదిన్నరగా అమరావతి నగర నిర్మాణమే ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రి నారాయణను కేంద్ర మంత్రి హోదాలో పెమ్మసాని డామినేట్ చేసేలా ప్రవర్తించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేంద్ర మంత్రి హోదాలో వివిధ అంశాలపై ఢిల్లీ స్థాయిలో పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడడం వరకు సమంజసమే అయినా, రాజధాని అమరావతికి క్షేత్రస్థాయిలో కర్త, కర్మ, క్రియగా వ్యవహరించే నారాయణ ప్రాధాన్యతని తగ్గించేలా షో చేయడాన్ని అటు ప్రభుత్వం, ఇటు పార్టీలో ముఖ్య నాయకులు సైతం ఖండిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో పని ఎవరిది, ఫలితం ఎవరిది, చివరికి పెత్తనం ఎవరిదయ్యింది అంటూ, మంత్రి నారాయణకు జరుగుతున్న అవమానం తమ సొంత పార్టీలోనే అంతర్గతంగా చర్చించుకుంటున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. అమరావతి అంశంలో కష్టం నారాయణదైతే, క్రెడిట్ పెమ్మసాని తీసుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ తెలుగు తమ్ముళ్ళు గుసగుసలాడుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక అమరావతి రైతు సంఘాల నాయకుల సైతం ఎన్నో ఏళ్లుగా తమకోసం, ప్రభుత్వం కోసం పనిచేసిన నారాయణ ప్రాధాన్యాన్ని తగ్గించి, నిన్నగాక మొన్నొచ్చిన పెమ్మసానికి పెత్తనమివ్వడం, "ముందొచ్చిన చెవులకంటే.. వెనుకొచ్చిన కొమ్ములు వాడి" అన్న సామెతని గుర్తుకి తెస్తోందని వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం.

### నెల్లూరులో ప్రజలకు, పార్టీకి ఎనలేని సేవ!

ఇక నెల్లూరుజిల్లా తెలుగుదేశం పార్టీలో నారాయణ తనదైన ముద్ర వేసుకుంటున్నారు. ముఖ్యంగా పార్టీ కార్యకర్తలకు అండగా వుంటూ వారి మనస్సుల్లో చెరగని స్థానం సంపాదించుకుంటున్నారు. మున్సిపల్ శాఖ మంత్రిగా అటు ప్రభుత్వపరంగా కూడా అభివృద్ధిలో దూసుకెళుతున్నారు. 2014–19 మధ్యకాలంలో 5,227 కోట్లు వెచ్చించి నెల్లూరు నగర అభివృద్ధిని పరుగులు పెట్టించారు. నగరంలోని మారుమూల ప్రాంతాల్లోని వీధులను సైతం సిమెంట్ రోడ్లుగా తీర్చిదిద్దారు. రూ.1100 కోట్లతో నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టారు. పాడుబడిపోయిన పార్కులను సుందర నందన వనాలుగా మార్చారు. ఇక రెండోసారి మంత్రి అయిన తర్వాత నెల్లూరులోని మున్సిపల్ స్కూళ్లను కార్పొరేట్ వసతులతో అభివృద్ధి చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి ప్రతిఏటా రూ.10 కోట్ల సొంత నిధులను వారికి నేరుగా అందిస్తున్నారు. కార్యకర్తలకు విద్య, వైద్యం, వ్యాపార అవసరాల కోసం ఒకొక్కరికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తున్నారు. మెప్మా ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయదలిచిన 200 కంటైనర్ దుకాణాల నిర్వహణ కోసం ఒక్కో దుకాణదారుడికి కోసం రూ.లక్ష చొప్పున తన సొంత నిధులను ఇస్తానని నారాయణ ప్రకటించారు. అందులో భాగంగా స్మార్ట్ సిటీ పేరుతో ఇప్పటికే ఏర్పాటైన 120 షాపుల నిర్వాహకులకు రూ.లక్ష వంతున 120 మందికి కోటి ఇరవై లక్షలు అందించారు. నగరంలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న రైల్వే ఫ్లైఓవర్ వంతెలను మంజూరు చేయించడంలో తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఒక్క నెల్లూరు నగరానికే 28 స్వీపింగ్ యంత్రాలను తెప్పించి నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు యత్నిస్తున్నారు. డంపింగ్ యార్డు వ్యవస్థకు స్వస్తి పలికి రీసైక్లింగ్ విధానానికి అంకురార్పణ వేసి నెల్లూరు నగరంతోపాటూ జిల్లా వ్యాప్తంగా ఉన్న నాయకులు, ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు.

### కమ్మ అయితే ఒకే, కాపు అయితే కష్టమా?

పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ, రాజధాని అంశంలోనూ, విద్యారంగంలోనూ తనదైన ముద్రవేసి జాతీయస్థాయిలో అవార్డులు, రివార్డులు అందుకుని నారాయణ ఇప్పటికే చరిత్ర సృష్టించారు. అయితే తాను చేపట్టిన ఏ పనిలోనైనా అంకితభావంతో పనిచేసి తనదైన మార్కుని వేసుకోవడం నారాయణ నైజం. అలాంటి నారాయణ వేగానికి ప్రస్తుతం సామాజికవర్గ సమస్య బ్రేకులు వేస్తోందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రస్తుతం రాష్ట్రాన్ని శాసిస్తున్న రెండు సామాజికవర్గాల్లో కమ్మ వర్గం ఒకటైతే కాపు వర్గం మరొకటి. ఇందులో మంత్రి నారాయణ కాపు సామాజిక వర్గానికి చెందినవారు కావడమే రాజధాని వ్యవహారాల్లో ఆయన ప్రాధాన్యం తగ్గడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కమ్మ సామాజిక వర్గం ఆధిపత్యం తెలిసిందే. అయితే తమవాడు కాకుండా కాపు వర్గానికి చెందిన నారాయణ రాజధాని విషయంలో కీలకపాత్ర పోషిస్తూ, అటు చంద్రబాబు, ఇటు ఆంధ్ర ప్రజల నుంచి ప్రశంసలందుకోవడం కొందరు కమ్మ సామాజికవర్గం నాయకులకు కంటగింపుగా మారిందని, ఈ నేపథ్యంలోనే వారంతా పెమ్మసానికి అమరావతి పెత్తనం కట్టబెట్టేలా పావులు కదిపినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా అటు విద్య వ్యవస్థతో పాటూ ఇటు రాజకీయాల్లో తన ప్రత్యేకతను చాటుకుంటూ ఆంధ్రుల కలల రాజధాని అయిన అమరావతిని భవిష్యత్‌లో టాప్–5 సిటీస్‌లో ఒకటిగా నిలబెట్టడం కోసం మంత్రి నారాయణ చేస్తున్న కృషి అమోఘం, అపూర్వం అనడంలో ఏమాత్రం సందేహం లేదు. ఇలాంటి తరుణంలో కుల రాజకీయాలతో రాజధాని అభివృద్ధి సామాజిక సుడి గుండంలోకి నెట్టేయడం సమంజసం కాదని మేధావులు అభిప్రాయపడుతున్నారు...!

## అమరజీవి ఆత్మబలిదానంతోనే.. ఆంధ్ర రాష్ట్రం!

• ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్



సత్కారాన్నందుకుంటున్న తెలుగు సంస్కృతం అకాడమీ అధ్యక్షులు ఆర్.డి.విల్సన్

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 58 రోజులపాటు ఆమరణ దీక్ష చేసి, ఆంధ్ర రాష్ట్ర సాధనకు అసువులే అర్పించారని, ఆ మహనీయుని ఆత్మబలిదానంతోనే మనకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం సిద్ధించిందని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ చెప్పారు. శ్రీ పొట్టి శ్రీరాముల వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల17న వెంకటాచలంలోని ఆ అధ్యయనకేంద్రంలో 'సమైక్య తెలుగు దినోత్సవం'ని పలువురు సాహితీవేత్తలతో కలసి నిర్వహించారు. తెలుగు–సంస్కృతం అకాడమీ అధ్యక్షులు ఆర్‌డి విల్సన్ (శరత్‌చంద్ర) ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంపత్‌కుమార్ మాట్లాడుతూ, శ్రీ పొట్టి శ్రీరాములు కృషితోనే భాషాప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి శ్రీకారంచుట్టడం జరిగిందన్నారు. చెన్నైలోని శ్రీ పొట్టి శ్రీరాముల స్మారక భవనం సంరక్షణకు, అభివృద్ధికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషిచేయాలని ఆయన కోరారు.

### శ్రీ పొట్టి శ్రీరాముల త్యాగం అజరామరం - ఆర్‌డీ విల్సన్

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం అజరామరమని, తెలుగువారంతా ప్రతి ఇంట్లోనూ అమరజీవి చిత్రపటాలను పెట్టుకుని, ఆ మహానుభావుని సేవలను గుర్తుచేసుకుంటుండాలని విల్సన్ కోరారు. తెలుగుభాష మాధుర్యం ఏ భాషలోనూ లేదని, మాతృభాషలో విద్యాభ్యాసం చేయడం వల్ల తెలుగు గొప్పదనం అర్థమవుతుందన్నారు. ప్రతిఒక్కరూ తెలుగు భాషను పరిరక్షించుకోవాలన్నారు. కేంద్ర బాలసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ప్రముఖ బాలసాహితీవేత్త డా. గంగిశెట్టి శివకుమార్ మాట్లాడుతూ, తెలుగుభాషాభివృద్ధికి అందరం కలసికట్టుగా కృషిచేద్దామన్నారు. ప్రముఖ కవి చిన్ని నారాయణరావు మాట్లాడుతూ, శ్రీ పొట్టి శ్రీరాములు.. నెల్లూరుజిల్లాకి చెందిన వ్యక్తి కావడం అదృష్టమని, మన జిల్లా శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లాగా పేరొందడం జిల్లాకే గర్వకారణమన్నారు. సమైక్యభారతి అధ్యక్షుడు చలంచర్ల భాస్కర్‌రెడ్డి, సమైక్యభారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, శ్రీ పొట్టి శ్రీరాములు ఆశయసాధన సమితి ప్రతినిధి డి.వెంకటేశ్వర్లు, ఐజేయు నేషనల్ మెంబర్ ఏ.జయప్రకాష్, డీకేడబ్ల్యు కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ కరుణశ్రీ తదితరులు పాల్గొని అమరజీవి సేవలను కొనియాడారు. అనంతరం నిర్వాహకులు ముఖ్యఅతిథులను, వక్తలను సన్మానించారు.

# జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బీద రవిచంద్ర

టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్ష పదవి మరోసారి బీద రవిచంద్రని వరించింది. గతంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా రవిచంద్ర 9 సంవత్స రాలు జిల్లా పార్టీసేవకి అంకితమై పని చేశారు. ఆ తరువాత రవిచంద్రకి పార్టీ అధిష్టానం ప్రమోషన్ ఇచ్చి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవితో సత్కరించింది. తన సొంత మండలం అల్లూరు పార్టీ అధ్యక్ష స్థాయి నుండి రవిచంద్ర అంచలం చెలుగా ఎదిగారు. ఏక పార్టీ సిద్ధాంతంతో ఏనాడు టీడీపీని వీడలేదు. రాముడికి



లక్ష్మణుడిలా తన అన్న మస్తాన్‌రావుకి తోడుగా రాజకీయాలలో కొనసాగినా మస్తానయ్య పార్టీ మారినప్పుడు కూడా రవిచంద్ర పార్టీని వీడలేదు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్ష పదవితో సహ పార్టీలో అనేక పదవులు అలంకరించారు. పార్టీ పెద్దలు తనకి అప్పజెప్పిన ప్రతీ బాధ్యతని రవిచంద్ర అంకితభావంతో నిర్వహించేవాడు. మొన్నటి 2024 ఎన్నికలలో రాయలసీమ జిల్లాల ఇన్‌ఛార్జిగా అభ్యర్థుల ఎంపిక కసరత్తులో ఆయన కీలకపాత్ర పోషించారు. పార్టీ విజయం కోసం అహరహం శ్రమించారు. యువ నేత నారా లోకేష్‌కి అత్యంత సన్నిహితమైన నాయకుడిగా కూడా రవిచంద్ర గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం శాసనమండలి సభ్యుడిగా రెండవసారి కొనసాగుతున్నారు. ఇప్పుడు నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడిగా పార్టీ రవిచంద్రని మళ్ళీ నియమించింది. పార్టీ అధ్యక్ష పదవి అంటే ముళ్లకిరీటమే. అయితే, "ఎప్పటికెయ్యది ప్రస్తుత మప్పటికా మాటలాడి యన్యుల మనముల్ నొప్పింపక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ" అని సుమతి శతకంలో చెప్పినట్లుగా, ఎవ్వరినీ నొప్పించకుండా, అందరినీ సంతృప్తిపరచే లక్షణం, లౌక్యం రెండూ కలిగి అందరివాడుగా పిలిపించుకుంటున్న రవిచంద్ర ఏ పదవిలో ఉంటే ఆ పదవికి న్యాయం చేస్తాడనడంలో సందేహం అవసరం లేదు. రవిచంద్రకి 'లాయర్' అభినందనలు..!

## తిరుపతి అధ్యక్షురాలిగా పనబాక లక్ష్మి!



తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలిగా పనబాక లక్ష్మి పేరుని టీడీపీ అధిష్టానం ఖరారు చేసింది. ప్రస్తుతం పనబాక లక్ష్మి తిరుమల తిరుపతి దేవస్థానాల ట్రస్టుబోర్డు సభ్యురాలిగా కూడా ఉన్నారు. పనబాక లక్ష్మి కాంగ్రెస్‌పార్టీ వేదికగా రాజకీయ అరంగేట్రం చేశారు. పది సంవత్సరాలపాటు కేంద్రమంత్రిగా పని చేసిన ఏకైక నెల్లూరుజిల్లా వాసిగా ఆమె ఖ్యాతికెక్కారు. 2018లో వైసీపీ అధినేత జగన్ నుండి పిలుపొచ్చినా ఆమె కాంగ్రెస్‌పార్టీని వీడలేదు. ఆ తరువాత అనూహ్యంగా తన భర్త పనబాక కృష్ణయ్యతో సహ టీడీపీ తీర్థం పుచ్చుకుని, 2019 ఎన్నికలలో తిరుపతి నుండి పార్లమెంటుకి పోటీచేసి ఓడిపోయారు. అప్పటినుండి ఆమె టీడీపీలోనే కొనసాగుతున్నారు. ఇప్పుడు పార్టీ ఆమెపై పెద్ద బాధ్యతని పెట్టింది. జిల్లా అధ్యక్ష పదవి అంటే కత్తి మీద సాము లాంటిదే. రాజకీయంగా అపార అనుభవంతో కాంగ్రెస్‌పార్టీలో యోధానుయోధులతో మెదిలిన పనబాక ఈ పదవికి కూడా సముచిత న్యాయం చేస్తుందని ఆశిద్దాం. ఆల్ ది బెస్ట్...!




## ఉప రాష్ట్రపతిని కలసిన విపిఆర్

భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి (విపిఆర్) మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి కార్యాలయానికి వెళ్లిన ఎంపీ వేమిరెడ్డి, ఆయనను శాలువాతో సత్కరించి, తిరుమల శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ఉప రాష్ట్రపతితో వివిధ అంశాలపై చర్చించారు.

### రామాయపట్నం పోర్ట్‌కు..
## రోడ్డుమార్గాలను పటిష్టం చేయండి

- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వేమిరెడ్డి వినతి

రామాయపట్నం పోర్ట్‌కు రోడ్డు మార్గాలను మంజూరుచేసి, రవాణా సదుపాయాలను పెంచాలని కోరుతూ కేంద్ర జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఇటీవల ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో విపిఆర్ కలసి ఆమేరకు వినతిపత్రం సమర్పించారు. ప్రధాన జాతీయ రహదారి-16 నుంచి పోర్ట్‌కు కనెక్టివిటీ పెంచాలని, కావలి వైపు నుండి ఎన్‌హెచ్-167 బీజీ వరకు పోర్టు రోడ్‌ను అనుసంధానం చేసి, రామాయపట్నం పోర్టు వరకు రహదారి విస్తరణ చేయాలని ఆయన కోరారు. ఈ కనెక్టివిటీ పెరిగితే పోర్ట్‌కు రవాణా సదుపాయం పెరగడంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకు సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, పోర్టుకు అదనపు కనెక్టివిటీ మార్గాల ఏర్పాటుపై పరిశీలించి తగిన చర్యలు చేపడతామని విపిఆర్‌కి తెలియజేశారు.

# ఇన్‌ఛార్జ్ మేయర్‌గా రూప్‌కుమార్

### ఈనాటి బంధం ఏనాటిదో..



మేయర్ రూప్‌కుమార్‌ని అభినందిస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

కిడ్నాపులు, ప్రలోభాలు, ప్రతిఫలాలతో ఉత్కంఠ భరితంగా సాగుతుందనుకున్న నెల్లూరు నగర్ మేయర్ పొట్లూరి స్రవంతి అవిశ్వాస తీర్మాన ప్రహసనం, ఆమె రాజీనామాతో 'టీ కప్పులో తుఫాన్'లా ముగిసిపోయింది. నెల్లూరు కార్పొరేషన్ టీడీపీ ఖాతాలో పడిపోయింది. ఇన్‌చార్జ్ మేయర్‌గా రూప్‌కుమార్‌యాదవ్ నియామకం జరిగిపోయింది. భవిష్యత్తు రాజకీయాలు పరిణామాలు ఎట్లున్నా, ఒక్కసారైనా తాను మేయర్ సీటుపై కూర్చోవాలన్న రూప్‌కుమార్‌యాదవ్ కోరిక కూడా తీరిపోయింది. నగరపాలక సంస్థలో బోర్డుపైన మేయర్‌లుగా పనిచేసిన వారి పేర్ల సరసన రూప్‌కుమార్ పేరు చేరిపోయింది.

స్రవంతి తన రాజీనామాని జిల్లా కలెక్టర్‌కి పంపించడం, ఆయన వెంటనే ఆమోదించడం క్షణాల్లో జరిగిపోయాయి. అయితే, ప్రభుత్వం కూడా అంతే వేగంగా స్పందించి డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్‌ని ఇన్‌ఛార్జ్ మేయర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చేసింది. డిసెంబర్ 15న సోమవారం నాడు రూపకుమార్ బాధ్యతలు చేపట్టారు. డిసెంబర్ 18వ తేదీ ఉదయం ఇన్‌ఛార్జ్ మేయర్ రూప్‌కుమార్ అధ్యక్షతన సింగిల్ అజెండాతో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కూడా మేయర్ రాజీనామాని ఆమోదిస్తున్నట్లు తీర్మానం చేసి సమావేశాన్ని ముమ అనిపించారు. మళ్ళీ కార్పొరేషన్ ఎన్నికలు జరిగే వరకూ, లేదా కౌన్సిల్ గడువు ముగిసే వరకూ రూప్‌కుమార్‌యాదవ్‌నే కొనసాగిస్తారా.. మరో ఎస్టీ అభ్యర్థిని మేయర్ స్థానంలో కూర్చోబెడతారా అన్నది భవిష్యత్ రాజకీయ తెరపై చూడాల్సిందే..!

### కోవూరులో..
# క్రీడాభివృద్ధికి సహకరించండి

### మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి ఎమ్మెల్యే ప్రశాంతమ్మ వినతి



కోవూరు నియోజకవర్గంలో మినీ స్టేడియంలు, ఆటస్థలాలు నిర్మించి క్రీడల అభివృద్ధికి సహకరించాలని క్రీడామంత్రి రాంప్రసాద్‌రెడ్డికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని మంత్రి కార్యాలయంలో ఆమె ఇటీవల మంత్రి రాంప్రసాద్ రెడ్డిని కలిసి క్రీడాభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాకలాపాల గురించి చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాలని, వారికి క్రీడల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. విడవలూరులో 50 లక్షలతో చేపట్టిన ఎన్.టి.ఆర్ క్రీడావికాస కేంద్రం మరియు 20లక్షలతో కొడవలూరులోని గిరిజన గురుకుల పాఠశాలలో స్టేడియం, ఆట స్థలాల నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని ఆమె మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా, మండల కేంద్రమైన ఇందుకూరుపేటలో క్రీడా ప్రాంగణం నిర్మాణానికి నిధులు మంజూరు చేయవలసిందిగా ఆమె కోరారు. ఇందుకూరు పేటలోని ఎం.కె.ఆర్ హైస్కూల్ ప్రాంగణంలో క్రీడా ప్రాంగణ నిర్మాణానికి అనువైన 5.70ఎకరాల స్థలం అందుబాటులో ఉందని ఆమె మంత్రికి వివరించారు. ప్రత్యేక ఆటస్థలాలతో కూడిన ఒక సమగ్ర క్రీడా ప్రాంగణాన్ని ఇక్కడ నిర్మించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు 4 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ప్రణాళికను మంత్రికి అందజేశారు.

# కృష్ణపట్నం ఆలయాలకి కొత్త పాలకమండలి

- ప్రమాణస్వీకారం చేయించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి



ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో వెలసివున్న..ఎంతో ప్రసిద్ధమైన శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయం, శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానాల కొత్త పాలకమండలితో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల ప్రమాణస్వీకారం చేయించారు. ఈ రెండు దేవాలయాల ఛైర్మన్‌గా నియమితులైన మామిడాల శ్రీనివాసులును ఆయన అభినందించారు. నూతన పాలకమండలికి శుభాకాంక్షలు తెలిపారు. మామిడాలతో పాటు పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ, ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన కృష్ణపట్నం ఆలయాల అభివృద్ధి విషయంలో తాము తొలినుంచి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. అంకితభావంతో పనిచేసే మామిడాల శ్రీనివాసులుతో పాటు పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో ఈ ఆలయాలకు మరింత అభివృద్ధి జరగాలని, భక్తులకు మెరుగైన సేవలు అందాలని ఆకాంక్షిస్తున్నామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

లాయర్
డిసెంబర్ 19, 2025

# పేరు మారినా..అవినీతి మారునా?!...

పేరు మార్చినంత మాత్రాన్నే అవినీతి తీరు మారుతుందా?.. అందులోనూ మనదేశంలో పేరుకుపోయిన అవినీతి జాఢ్యం అంత సులభంగా పోయేదేనా?.. అక్రమాల పుట్టగా మారివున్న ఉపాధి పథకాన్ని సంస్కరించడమంటే, అందులో ఉన్న మహాత్మాగాంధీ పేరును తీసేస్తే సరిపోతుందా?.. అనే ప్రశ్నలు ఇప్పుడు దేశంలో పెద్ద చర్చనీయాంశంగా మారాయి. కేంద్రప్రభుత్వం తాజాగా లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై విపక్షాలు విరుచుకుపడడం, జాతిపిత మహాత్మాగాంధీ పేరును తీసేయడం సముచితం కాదంటూ కాంగ్రెస్‌పార్టీ విమర్శలు చేయడం జరిగాయి. 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం'ని రద్దుచేసి, దాని స్థానంలో 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-(గ్రామీణ్ (వీబీ జీరామ్‌జీ)పేరుతో ఆ పథకాన్ని మార్చడంపై లోక్‌సభలో గందరగోళం కూడా జరిగింది. ఆ సంగతి అటుంచితే, పథకం పటిష్టంగా ఉండాలే కానీ, పేరు మార్చడం వల్ల ఉపయోగం ఏముంటుందనే అభిప్రాయాలే సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా పేదలకు ఉపాధి కల్పించే ఈ పథకం సుమారు ఇరవై ఏళ్ళ క్రితం ప్రారంభమైంది. రాకాసి కరువులు, కరోనా మహమ్మారి విజృంభణ వంటి సందర్భాల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో నిరుపేదలకు పనులు కల్పిస్తూ, కోట్లాదిమంది కష్టజీవుల కడుపునింపి, మరెందరికో జీవనోపాధికి దారిచూపిన బృహత్తర పథకం ఇది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించేందుకు, రోడ్లు వేయడం, కాలువలు తవ్వడం, నీటివనరులకు సంబంధించిన ఇతరత్రా ప్రజోపయోగ పనులెన్నో ఈ పథకం ద్వారా సాకారమవుతున్నాయి. జలవనరులు కల్పనకు చేసే పనుల వల్ల ఆయా ప్రాంతాల్లో నీటికొరత తగ్గుతుంది. ఇంతవరకు బాగానే ఉంది. అయితే ఈ పథకంలో క్రమేణా అవినీతి జలగలు చేరిపోయాయి. వేలు, లక్షలు కాదు, కోటానుకోట్ల రూపాయల ఉపాధి డబ్బు స్వాహాల పర్వంలోకి మారిపోయింది. ఉపాధిహామీ పనులను పేదలతో చేయిస్తున్నామంటూ దొంగమస్టర్లు వేసేసి, ఆ డబ్బునంతా మింగేసి, అటు ప్రభుత్వానికి..ఇటు పేద కూలీలకు పంగనామాలు పెట్టడం బాగా అలవాటు చేసుకున్నారు. అనేక గ్రామాల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది ఈ పథకానికి చిల్లులు పెట్టేశారు. దేశవ్యాప్తంగా ఈ పథకానికి సంబంధించిన వందల కోట్ల రూపాయల ధనం దుర్వినియోగమైందనే నిజం తనిఖీల్లో బహిర్గతం కావడంతో, కేంద్రం ఆ అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలకు సిద్ధమైంది. ఈ పథకాన్ని పునఃపరిశీలించి తాజా నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ పథకం అమలును పర్యవేక్షించాలని, ఉపాధి కల్పన బాధ్యత స్థానికంగా ఉండే ప్రభుత్వాలే చూసుకోవాలని నిర్ణయించింది. కూలీల పనిదినాలను నూరు నుంచి 125కి పెంచింది. మంచిదే. అయితే, ఆ పథకానికయ్యే వ్యయంలో 10శాతం వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే భరించేవి. ఇకనుంచీ అలాకాదు..40శాతం ఖర్చును రాష్ట్రప్రభుత్వాలు భరించాలని కేంద్రం స్పష్టం చేయడంతో, రాష్ట్రాల గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. ఎందుకంటే ఏటా కనీసం 50వేల కోట్ల భారీ మొత్తాన్ని ఆ పథకానికి అందించడమంటే మాటలు కాదు. అది రాష్ట్రాలకు అసాధ్యమనడంలో సందేహం లేదు. అసలే ఆర్థిక పరిస్థితులు బాగాలేక కుయ్యోమొర్రోమంటున్న ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోనైతే ఈ కొత్త నిర్ణయం పెను భారమే. దీంతో ఈ పథకం ఉంటుందో..చివరికి రద్దయిపోతుందోననే అనుమానాలు కూడా ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా, ఉపాధి పథకంలో ఇప్పటిదాకా జరిగిన అవినీతిని వెలికితీసి, అక్రమార్కుల నుంచి ప్రభుత్వ సొమ్మును రికవరీ చేయించడం, నిరుపేదలకోసం కేటాయించిన పథకాన్ని కూడా స్వాహా చేసినవారిపై కఠినచర్యలు తీసుకోవడం వంటివి ఎప్పటికప్పుడు జరిగితే, ఏ పథకమైనా సరిగ్గా అమలులోకి వస్తుంది. అవన్నీ వదిలేసి, పేరు మార్చినందువల్లనో, ఆ పథకం పర్యవేక్షణకి మరింతమందిని కేటాయించినందువల్లనో, రాష్ట్రాలపై ఆ పథకం భారం పెంచడం వల్లనో ఫలితం ఏముంటుంది?.. ఇకనైనా లోపం ఎక్కడుందో ప్రభుత్వాలు గుర్తించాలి. ఈ పథకం ఎక్కడ డొల్లగా మారుతుందో కనిపెట్టి, అక్కడ శాశ్వత ప్రాతిపదికన అతుకు వేయడంతో పాటు, పథకాన్ని మరింత పటిష్టంగా అమలుచేస్తే తప్ప ఇలాంటి ప్రజోపయోగ పథకాలు అసలైన లబ్దిదారులకు అందవన్నది బహిరంగ రహస్యమే. ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోవాలే తప్ప, కేవలం పేరు మార్చినంత మాత్రాన పేదలకు, లేదా ప్రజలకు కొత్తగా ఒరిగేదేం ఉంటుంది?..



## సత్యపీఠం

నిజాలే మాట్లాడుకుందాం! 121

# 'బతకలేని వాళ్ళుగా ప్రయివేటు బడిపంతుళ్ళు'!

"బతకలేని వాడు బడి పంతులు" అన్నది ఒకప్పటి మాట. పాతరోజుల్లో చాలీచాలని జీతాలతో సతమతమవుతుండిన ప్రభుత్వ అయ్యవార్లని ఉద్దేశించి ఈ మాట వాడేవారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారి, ప్రయివేటు రంగంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకి మాత్రమే ఈ మాట అక్షరాలా సరిపోతుందనడంలో అతిశయోక్తి లేదు.

భారతీయ విద్యా వ్యవస్థలో రెండే రెండు విభాగాలు వున్నాయి. ఒకటి ప్రభుత్వ రంగం-రెండవది ప్రయివేట్ రంగం. నాణ్యమైన విద్యని అందించడంలో ఈ రెండు విభాగాలూ ఒకదానితో ఒకటి పోటీపడుతున్నాయా? అని ప్రశ్నిస్తే.. లేదు అనే సమాధానమే వినిపిస్తుంది. పోనీ, ఈ రెండు విభాగాలలో పనిచేసే ఉపాధ్యాయ బృందానికి సమన్యాయం జరుగుతుందా...? అని అడిగితే కూడా అస్సలు లేదన్న సమాధానమే వస్తుంది. సమాంతర విద్యా అర్హతలతో బోధనా రంగంలో పట్టాలు పుచ్చుకున్న లక్షలాదిమంది టీచర్లు మన దేశంలో వున్నారు. అయితే, వారి జీతభత్యాలలో ఊహించలేని వ్యత్యాసం మనకి కనిపిస్తుంది. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ఉత్తమ మార్కులతో అసామాన్య ప్రతిభాపాటవాలతో డిగ్రీలు పుచ్చుకున్న ఉపాధ్యాయులకి మన దగ్గర కొదవలేదు. కానీ, వారి నెల భత్యాలు ప్రభుత్వ రంగంలో లక్షల్లో ఉంటే ప్రయివేటు రంగంలో వేలల్లోనే ఉండిపోతోంది. ఇలాంటి దురదృష్ట జాతక ప్రయివేటు టీచర్లు మన రాష్ట్రంలో వేలాదిమంది అతి భారంగా తమ బ్రతుకు బండిని లాగుతున్నారు. వీరి సంఖ్య మన రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు మూడు లక్షలకిపైగానే ఉంది.

### జీతాలలోనే కాదు విధులలో సైతం వ్యత్యాసం!

ప్రభుత్వ రంగంతో పోలిస్తే ప్రయివేటు పాఠశాలలోని టీచర్లకు పని కూడా ఎక్కువే. ఉదయం బడికి వచ్చినప్పటి నుండి రాత్రి తిరిగి ఇంటికి వెళ్ళే వరకూ వాళ్ళు గొడ్డు చాకిరీ చేయాలి. ముఖ్యంగా పరీక్షల సమయంలో ప్రయివేటు పాఠశాలలలో చదివే విద్యార్థులకంటే టీచర్లపైనే వత్తిడి ఎక్కువగా ఉంటుంది. మంచి స్థాయిలో పిల్లలు ఉత్తీర్ణత సాధించకపోతే తాము సమాధానం చెప్పుకోవాలన్న మానసిక ఆందోళన వాళ్ళని వేధిస్తుంది. ఇక విద్యా సంవత్సరం ముగిసిన తరువాత కూడా ప్రయివేటు టీచర్లకి సెలవులు వుండవు. విరామం, విశ్రాంతి వుండదు. తమ స్కూళ్ళకి సంబంధించిన ఇతర పనులకి వాళ్ళని వాడుకుంటారు. ఇంటింటికీ తిరిగి, పిల్లల తల్లి తండ్రులని చైతన్య పరచి, వాళ్ళ బిడ్డలని తమ స్కూళ్ళలో చేర్పించేలా వాళ్ళని ఒప్పించే భాధ్యత కూడా తమ టీచర్లకే అప్పగిస్తారు.

ప్రభుత్వ రంగంలో అలా కాదు. అక్కడి టీచర్లు సరిగ్గా బడివేళల ప్రకారం తమ విధులు నిర్వహిస్తారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో మాత్రమే విద్యాబోధన చేస్తారు. వేసవి సెలవులలో విహార యాత్రలకి వెళ్తారు. అందరూ ఇదే తరహాలో ఉంటారని భావించలేం. కానీ మొత్తం 95 శాతం మంది ఇదే విధానాన్ని అనుసరిస్తారు. ఎక్కడో ఓ 5శాతం మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రం పేద విద్యార్థుల ఉన్నత భవిష్యత్తే తమ లక్ష్యంగా పెట్టుకుని అంకితభావంతో వారిని తీర్చిదిద్దుతున్నారు.

### పట్టించుకోని ప్రభుత్వాలు, నాయకులు..!

చిన్నతనం నుంచి పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి, వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే గురువులదే సమాజంలో ప్రధానపాత్ర. అంతటి కీలకమైన బాధ్యతలు నెరవేర్చే ఉపాధ్యాయులకి ప్రభుత్వాలు సమాంతర ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ముఖ్యంగా ప్రయివేటు రంగంలో పని చేసే టీచర్లని అస్సలు పట్టించుకోవడం లేదు. ప్రయివేటు టీచర్లతో తమకేం సంబంధమన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. వాళ్ళు కూడా సమాజంలో భాగమే అన్న విషయాన్ని విస్మరిస్తున్నాయి. ప్రయివేటు టీచర్ల బాగోగులని వాళ్ళు పనిచేసే యాజమాన్యానికి వదిలేస్తున్నాయి. ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థులుగా వారి ఓట్ల ద్వారా గెలిచి చట్టసభలకు వెళ్ళే ఉపాధ్యాయ నాయకులు కూడా ప్రయివేటు టీచర్ల కష్టాలు గమనించడంలేదు. ఎన్నికల వేళ మాత్రం వారిని ప్రసన్నం చేసుకోవడానికి వాళ్ళ చుట్టూ ప్రదక్షిణ చేసే నాయకులు అవి ముగిసిన తరువాత ప్రయివేటు టీచర్ల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ప్రభుత్వ ఉపాధ్యాయ బృందాలకు చాలా శక్తివంతమైన యూనియన్లు కూడా ఉంటాయి. సదరు యూనియన్లు ప్రభుత్వ పరంగా తమకి రావలిసిన హక్కుల పైనే ఎక్కువగా దృష్టిపెట్టి పోరాడుతాయి తప్ప ప్రయివేట్ టీచర్ల కష్టాలు వాటికి పట్టవు. అలాగే ప్రయివేట్ పాఠశాలల ఉపాధ్యాయ యూనియన్లు కూడా వున్నా వాటిని ప్రభుత్వాలు ఖాతరు చేయవు.

### ద్వంద్వ విధానాలు మారాలి..!

ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే అధ్యాపకులతో సమాంతరంగా ప్రతిభ, విద్యార్హతలు కలిగిన ప్రయివేటు టీచర్లకి కూడా సముచిత స్థాయిలో జీతాలు ఇచ్చేలా ప్రభుత్వాలు చట్టం తీసుకురావాలి. ఫీజుల రూపంలో లక్షల రూపాయలు వసూలుచేస్తూ.. టీచర్ల జీతాలని మాత్రం నామమాత్రంగా ఇస్తున్న విద్యాసంస్థలపై నిత్యం ప్రభుత్వ పర్యవేక్షణ ఉండాలి. ప్రయివేటు రంగంలో విద్యావిధానాలు అవలంబించడానికి వున్న షరతులతో పాటు, ఉపాధ్యాయుల జీతభత్యాలపై నిబంధనలు రూపొందించాలి. ప్రభుత్వ టీచర్ల నియామకాల ప్రక్రియని అనేక రాష్ట్రాల ప్రభుత్వాలు ఆలస్యం చేస్తున్నాయి. నోటిఫికేషన్ వచ్చేలోగా పుణ్యకాలం కాస్తా దాటిపోయి, ఉద్యోగార్హత వయసు మించిపోయి, ఎందరో విద్యావంతులు ఉద్యోగాలు లేక వీధినపడుతున్నారు. ఈ క్రమంలో ప్రతిభావంతులైన అధ్యాపకులు విధిలేని పరిస్థితులలో బతుకుతెరువు కోసం ప్రయివేటు యాజమాన్యాలకి తమ అక్షర జ్ఞానాన్ని తాకట్టు పెడుతున్నారు. పాఠశాలల యాజమాన్యాలు కూడా టీచర్ల అవసరాలని తమ అవకాశాలుగా మార్చుకుని అతి తక్కువ జీతభత్యాలతో వాళ్ళని నియమించుకుంటున్నారు. ప్రభుత్వ రంగంలో వున్న లొసుగులని తమకి అనుకూలంగా మార్చుకుంటున్నారు. ప్రయివేటు యాజమాన్యాలు కూడా ఉపాధ్యాయుల అర్హతకి తగ్గట్లుగా వారిని గౌరవించాలి. వీరు కాకపోతే ఇంకొకరులే అనే ధోరణికి స్వస్తి పలకాలి. "బతుకు నేర్పేవాడు బడి పంతులు" అనేలా అయ్యవార్లకి విలువనిచ్చి ప్రయివేటు యాజమాన్యాలు కూడా ప్రభుత్వ తరహాలో తమ ఉపాధ్యాయులని గుర్తించి గౌరవిస్తారని ఆశిద్దాం..!

- రాజశ్రీ

# మతమార్పిడులపై రాజస్థాన్ తరహా చట్టం రావాలి!

అత్యధికంగా మత మార్పిడులు జరుగుతున్న భారతదేశంలో, వాటిని నివారించడానికి కొన్ని రాష్ట్రాలు కొన్ని కఠిన చట్టాలు తెస్తున్నాయి. ఇప్పటికే మన దేశంలోని పది రాష్ట్రాలలో ఈ చట్టాలు అమలులో వున్నాయి. తాజాగా రాజస్థాన్ రాష్ట్రం ఈ చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఈ కొత్త చట్టం ప్రకారం ఎవరైనా బలవంతపు మతమార్పిడులకి పాల్పడుతున్నట్లు తెలిస్తే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెడతారు. వారెంట్ లేకుండానే వారిని అరెస్టు చేస్తారు. నేరం రుజువైతే 7సంవత్సరాల నుండి 14 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధిస్తారు. అలాగే మత మార్పిడి కోసం ఎవరైనా పెళ్లిచేసుకున్నట్లైతే ఆ పెళ్లి చెల్లదు. దివ్యాంగులని లేదా మహిళలని ప్రలోభపెట్టి మత మార్పిడి చేయిస్తే ఆ శిక్షలు ఇంకా తీవ్రతరంగా ఉండేలా సదరు కొత్త చట్టంలో పొందుపరచారు. బృంద మత మార్పిడులకు ప్రోత్సహిస్తే 20 సంవత్సరాలు లేదా జీవిత ఖైదు విధిస్తారు. నేర తీవ్రతని బట్టి జరిమానాలు కూడా 5లక్షల నుండి 50లక్షల వరకూ ఉండేలా చట్టాన్ని పకడ్బందీగా రూపొందించారని అంటున్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలలో కూడా రాజస్థాన్ తరహా చట్టం రావాలి. ప్రతీ రాష్ట్రంలో ఈ మతమార్పిడి తంతు ఎక్కువైపోతోంది. ముఖ్యంగా అమాయకులైన మహిళలని టార్గెట్ చేస్తున్నారు. అసలు రాష్ట్రాలతో సంబంధం లేకుండా కేంద్రమే దేశవ్యాప్తంగా ఇలాంటి చట్టం తీసుకొస్తే మతమార్పిడులను చాలావరకూ అరికట్టవచ్చు.

- యం. చంద్రమౌళి, కొత్త ఢిల్లీ.




## ఆలయాల దగ్గర పోలీసు రక్షణ పెట్టాలి

ధనుర్మాసం సందర్భంగా నగరంలోని అన్ని వైష్ణవ ఆలయాలలో డిసెంబర్ 17 నుండి భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. ముఖ్యంగా తెల్లవారుఝాము నాలుగు గంటల నుండే మహిళలు అధిక సంఖ్యలో ఈ ఆలయాలకి తరలివస్తున్నారు. మాగుంట లే అవుట్‌లో వున్న బాలాజీ దేవస్థానం ఉదయం పూట మహిళా భక్తులతో క్రిక్కిరిసి పోతోంది. తెల్లవారి వేళ ఆలయానికి తరలివచ్చే మహిళలకి రక్షణ చాలా అవసరం. పోలీసు శాఖ వారు తక్షణమే స్పందించి మాగుంట లేఅవుట్‌తో పాటు ఇతర ప్రాంతాలలోని వైష్ణవ ఆలయాల వద్ద తమ సిబ్బందిని నియమించవలసిందిగా కోరుతున్నాను.

- వీ.సీ.చౌదరి, మాగుంట లేఅవుట్.

# కాంగ్రెస్ తప్పులే బీజేపీకి బలం!

తమిళనాడులో ఒక దీపం వెలిగితే, వందమంది ఎంపీలకి కళ్ళు బైర్లు కమ్మాయి. మత స్వేచ్ఛ రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని ఒక న్యాయమూర్తి చెప్తే, ఆయన ఒక మతం వైపు లొంగుతున్నారు అనిపించిందా? సెక్యులరిజం అంటే... హిందూ విశ్వాసాలను తొక్కి పెట్టడమేనా? న్యాయమూర్తిపై అభిశంసన పెట్టడం ద్వారా, మెజారిటీ తమిళుల విశ్వాసాలను గాయపరచి... తాము ఎంత పెద్ద తప్పు చేస్తున్నామో కాంగ్రెస్ పెద్దలకి అర్థం కావటం లేదా? తమ విశ్వాసాన్ని గౌరవించని పార్టీని హిందువులు ఎందుకు అక్కున చేర్చుకుంటారు? కాంగ్రెస్ పెద్దలకి ఆమాత్రం ఇంగితం లేదా? అదేమంటే ఈవీఎం హ్యాకింగ్, ఓట్ చోరీ అంటూ ఆగమాగం చేస్తారు తప్ప.. రోజు రోజుకి వారి పార్టీ బలం తగ్గడానికి కారణం ఇలాంటి తప్పుడు నిర్ణయాలే అని వాళ్లకి చెప్పేవారు లేరా? కాంగ్రెస్‌పార్టీ తరచూ చేస్తున్న ఇలాంటి వ్యూహాత్మక తప్పిదాలే బీజేపీకి బలమవుతున్నాయి..!

- ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాదు.

# కల నిజమైన వేళ...

## జీవీకే స్కూలు వార్షికోత్సవ, ప్రారంభోత్సవ వేడుకల హేల!



ప్రముఖ పారిశ్రామికవేత్త, మన నెల్లూరీయులు, 'పద్మభూషణ్' బిరుదాంకితులు డాక్టర్ జీవీకే రెడ్డి కల నిజమయ్యింది. రెండు దశాబ్దాల ఆయన తపన ఫలించింది. తాను పుట్టినగడ్డలో చిరస్థాయిగా నిలిచిపోయేలా ఒక బృహత్తర కార్యక్రమాన్ని చేయాలన్న ఆయన ఆకాంక్ష నెరవేరింది. భావిభారత పౌరుల కోసం అత్యాధునిక విద్యాలయాన్ని నిర్మించి నెల్లూరు ప్రజలకి అంకితం చేయాలన్న ఆయన ఆలోచన కార్యరూపం దాల్చింది. గునుపాటి వెంకట కృష్ణారెడ్డి (జీవీకేరెడ్డి) దాతృత్వంతో, నెల్లూరు నగరం లోని శ్రీ కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణంలో నెలకొల్పబడిన జీవీకే స్కూల్ ప్రారంభోత్సవం డిసెంబర్ 13వతేదీ శనివారం నాడు జరిగింది. ఇదే సమయంలో స్కూలు వార్షికోత్సవం కూడా నిర్వహించారు. ఈ రెండు వేడుకలూ చిన్నారుల కేరింతలు, వారి అమ్మానాన్నల ప్రశంసల మధ్య ఘనంగా జరిగాయి.

జీవీకే రెడ్డి దాతృత్వానికి సాక్షీభూతంగా 30కోట్ల రూపాయల నిధులతో శ్రీ కస్తూరిదేవి ప్రాంగణంలో 72 వేల చదరపు అడుగుల నిర్మాణంలో అధునాతన విద్యా ఆలయంగా జీవీకే స్కూలు నిర్మితమయ్యింది. 2025-2026 విద్యా సంవత్సరానికి ఈ ఏడాది జూన్‌లోనే అడ్మిషన్లని పూర్తి చేసుకుని జిల్లా విద్యా రంగంలో జీవీకే స్కూల్ తమ సేవలని ప్రారంభించింది. అయితే, ఈ అపురూప భవన సముదాయాన్ని శనివారం నాడు జీవీకేరెడ్డి లాంఛనంగా ప్రారంభించి నెల్లూరుజిల్లా ప్రజలకి అంకితం చేశారు. అదేరోజు జీవీకే స్కూల్ వార్షికోత్సవ వేడుక కూడా సంతోష సంరంభంగా జరిగింది. ఇకపై ఈ స్కూలుకి జీవీకే కుటుంబానికి సంబంధం లేదు. జీవీకేరెడ్డి కేవలం దాత మాత్రమే. శ్రీ కస్తూరిదేవి విద్యాలయ కమిటీ ఆధ్వర్యంలోనే ఈ విద్యాసంస్థ నడుస్తుంది. జీవీకేరెడ్డితో పాటు ఆయన సతీమణి ఇందిరా కృష్ణారెడ్డి, కుమారుడు సంజయ్‌రెడ్డి, కోడలు అపర్ణ(పింకీ)రెడ్డి ఈ వేడుకలలో పాల్గొన్నారు.











## ఆకట్టుకున్న సాంస్కృతిక వేడుక!

స్కూల్ ప్రారంభించిన తొలి ఏడాది వార్షికోత్సవం వేడుకే అయినా.. జీవీకే స్కూల్ విద్యార్థినులు ఇచ్చిన ప్రదర్శన ఔరా అనేలా అందరినీ అబ్బురపరచింది. "మీరాస్ క్వెస్ట్" అనే కాన్సెప్ట్‌తో తయారు చేసిన నృత్య రూపకం ఆధ్యంతం అలరించింది. నెల్లూరుజిల్లాలోని అనేకమంది ప్రముఖుల వేషధారణలో వారిని సభకి పరిచయం చేస్తూ, భారతదేశంలోని వివిధ రాష్ట్రాల ప్రాముఖ్యతని, సంస్కృతులని వివరిస్తూ ఈ సాంస్కృతిక ప్రదర్శన రూపొందించారు. శ్రీ కస్తూరీదేవి విద్యాలయ కమిటీ సెక్రటరీ మరియు కరెస్పాండెంట్ దొడ్ల శేషారెడ్డితో పాటు కమిటీ సభ్యులు పీ.వీ.ప్రసన్నరెడ్డి, ఆదిశేషారెడ్డి, జీవీకే స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఉషారెడ్డి, ప్రిన్సిపల్ మధునెగి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇది నా ఇరవై ఏళ్ళ కల - జీవీకే రెడ్డి



జీవీకే రెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి దివంగతులైన తరువాత, మేనకూరు గోపాలకృష్ణారెడ్డి కోరిక మేరకు తాను శ్రీ కస్తూరిదేవి విద్యాలయ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టానన్నారు. తాను అధ్యక్షునిగా కమిటీలో చేరే నాటికి చాలా సమస్యలు ఉండేవన్నారు. బాలికల పాఠశాలలో పనిచేసే టీచర్లకి, సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఇందులో ఎవరి తప్పూ లేదని, రెవెన్యూ లేని కారణంగా ఈ ఇబ్బందులు ఉండేవన్నారు. ఆనాటి నుండే తన సొంత నిధులతో సంస్థని నడపడం ప్రారంభించామన్నారు. విద్యార్థినులకి, టీచర్లకి టాయిలెట్‌లు కూడా లేని దుస్థితి ఉండేదన్నారు. కొత్త టాయిలెట్స్ నిర్మించడంతో పాటు, బాలికల విద్యాలయాన్ని కూడా తమ సొంత నిధులతో ఆధునీకరించామన్నారు. స్కూల్ ప్రాంగణంలోని 7 ఎకరాల స్థలంలో మల్లెతోటలు వుండేవని, వాటి లీజుదారు అదేచోట ఇంటిని కూడా నిర్మించుకుని నివసిస్తుండేవాడని చెప్పారు. సదరు లీజుదారుడికి పెద్దమొత్తంలో పరిహారం చెల్లించి ఖాళీ చేయించి, సంస్థ ఆస్తులని కాపాడామని చెప్పారు. విద్యాలయ బాగు కోసం తాము చేపట్టిన సంస్కరణలలో ఇది అతిపెద్దదన్నారు. స్కూలు ప్రాంగణంలో లీజుదారులుగా వున్న ఒక్కొక్కరిని ఖాళీ చేయిస్తూ వస్తున్నామన్నారు. తాజాగా రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియం లీజుదారుడిని ఖాళీ చేయించామని, 2026 మార్చినాటికి స్కూలు వెనుకవున్న కళ్యాణమండపాన్ని కూడా తొలగిస్తామని చెప్పారు. సంస్థని, సంస్థ ఆస్తులని పరిరక్షించడమే ధ్యేయంగా తాను పని చేశానని అన్నారు. ఇన్నాళ్లుగా తానూ ఏమీ మాట్లాడలేదని ఏదైనా చెప్పింది చేసి చుపించాకే మాట్లాడడం తనకి అలవాటని అన్నారు. తాను అనుకున్న లక్ష్యానికి సాక్షీభూతమే ఈ స్కూల్ ప్రాంగణం అన్నారు. ఇది తన ఇరవైఏళ్ళ కల అని, ఇన్నాళ్ళకి అది నెరవేరినందుకు తనకి చాలా అనందంగా ఉందన్నారు. చాలామంది పిల్లల అమ్మానాన్నలు జీవీకే స్కూల్‌లో కో-ఎడ్యుకేషన్ ప్రారంభించమని అడుగుతున్నారని, వారి కోరిక మేరకు రాబోవు విద్యా సంవత్సరం నుండి మగపిల్లలకి కూడా ఈ స్కూల్‌లో చదువుకునే అవకాశం కల్పిస్తున్నామని ప్రకటించారు. ప్రస్తుతం ఎయిడెడ్ స్కూలుగా ప్రభుత్వ అజమాయిషీలో నడుస్తున్న శ్రీ కస్తూరిదేవి బాలికల విద్యాలయాన్ని కూడా ఆధునిక వసతులతో తీర్చిదిద్దబోతున్నట్లుగా ప్రకటించారు. భవిష్యత్తులో ఆ స్కూలుని ఎయిడెడ్ పాఠశాలగా కాకుండా జీవీకే స్కూలుకి ధీటుగా పూర్తిగా కస్తూరిదేవి విద్యాలయ కమిటీ ఆధ్వర్యంలోనే నడిచేలా చర్యలు చేపట్టనున్నామన్నారు. చిన్నారుల మానసిక, శారీరక వికాసాన్ని పెంపొందించేలా క్రీడలతో పాటు ఇతర రంగాలలో సైతం వారిని ప్రోత్సహిస్తామన్నారు. నెల్లూరీయురాలైన డాక్టర్ ఉషారెడ్డి డైరెక్టర్‌గా ఉండడం ఈ విద్యాసంస్థల అదృష్టంగా భావిస్తున్నానన్నారు. విద్యారంగంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఘనత ఉషారెడ్డికి ఉందని చెప్పారు. ఈ ప్రాంగణంలో చిన్నారులకి అత్యుత్తమమైన విద్య అందించాలన్నది తన ఇరవై ఏళ్ళ కల అని, ఇన్నాళ్ళకి అది నిజమయ్యింది అన్నారు. భవిష్యత్తులో కూడా ఎక్కడా రాజీపడకుండా శ్రీకస్తూరీదేవి విద్యాలయ కమిటీ ఈ స్కూళ్ళని నడిపేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. తనకి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## మా కుటుంబానికీ.. ఈ స్కూలుకి సంబంధం లేదు

**'లాయర్'తో జీవీకే రెడ్డి**

ఈ విద్యాసంస్థలకి తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని జీవీకే రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన 'లాయర్'తో మాట్లాడుతూ జీవీకే స్కూల్ తన సొంతదన్న అపోహ చాలామంది నెల్లూరీయులలో ఉందని, ఈ సంస్థలు పూర్తిగా శ్రీ కస్తూరిదేవి విద్యాలయ కమిటీ అజమాయిషీలోనే నడుస్తాయని, తాను కేవలం దాతని మాత్రమే అని క్లారిటీ ఇచ్చారు. ఈ స్కూల్ ఆస్తులని ప్రయివేట్ వ్యక్తుల చెర నుండి కాపాడడమే ముఖ్యఉద్దేశంగా పనిచేశామన్నారు. రాబోయే రోజుల్లో తన కుటుంబసభ్యులు కూడా నిస్వార్థంతో, సేవాభావంతో ఈ సంస్థకి అండగా ఉంటారని, సంస్థ అభివృద్ధికి వారివంతు చేయూతనిస్తారని 'లాయర్'తో చెప్పారు.



# ఉత్సాహంగా..'కృష్ణచైతన్య' స్పోర్ట్స్ మీట్




మూడురోజులు పాటు జరిగిన నెల్లూరులోని కృష్ణచైతన్య కళాశాలల స్పోర్ట్స్‌మీట్ మంగళవారం ముగిసింది. స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన ఈ స్పోర్ట్స్‌మీట్‌లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. కృష్ణచైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మెన్ డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొని క్రీడా జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా వారికి కళాశాలల ఎన్‌సిసి క్యాడెట్లు గౌరవ వందనం సమర్పించారు. తమ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సాహం అందిస్తున్నామని వారు తెలిపారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, కృష్ణచైతన్య విద్యాసంస్థలు గత 27 సంవత్సరాలుగా అంచలంచెలుగా ఎదుగుతూ నేడు 15వేల మంది విద్యార్థులకు విద్యను అందిస్తుండడం తమకెంతో ఆనందం కలిగిస్తోందన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో సుమారు 4వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొనడం విశేషం. విద్యాసంస్థల డైరెక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డి, డీన్ రామాంజనేయులు రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, అడ్మిన్ డీన్ రమేష్, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# సుందరేశ్వరస్వామికి విశేషాభిషేకాలు



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కొలువై ఉన్న శ్రీ మీనాక్షిదేవి సమేత శ్రీ సుందరేశ్వరస్వామి దేవాలయంలో త్రయోదశి సందర్భంగా ఈనెల 17న విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. నందీశ్వరునికి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ మరియు ఇఓ కోవూరు జనార్దన్‌రెడ్డి ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# పీఎంపీ ఆవిర్భావ దినోత్సవం..27న



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న భాస్కర్‌రెడ్డి, పీఎంపీ సంఘం సభ్యులు

సమాజంలోని పేదవర్గాలకు సేవలందిస్తున్న పీఎంపీ వ్యవస్థ 67వ ఆవిర్భావ దినోత్సవం ఈనెల 27న నెల్లూరులోని ఏనుగు సుందరరామిరెడ్డి ఆడిటోరియంలో జరుగుతుందని నారాయణ ఆసుపత్రి ఏజీఎం భాస్కర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు పొగతోటలోని నారాయణ ఆసుపత్రిలో ఆమేరకు కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. జిల్లా పీఎంపీ సంఘం అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# మంత్రి నారాయణ సేవలు ఆదర్శం



'హెల్త్ ఆన్ వీల్స్' కార్యక్రమంలో భాగంగా పేదలకు సేవలందిస్తున్న వైద్యులు

నెల్లూరు సిటీ 16వ డివిజన్ గుర్రాలమడుగు సంఘం సెంటర్‌లో ఇటీవల నారాయణ హెల్త్ ఆన్ వీల్స్ కార్యక్రమం జరిగింది. 16 డివిజన్ టిడిపి ఇన్చార్జ్ సాయి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్..ఆయన సతీమణి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో మంత్రి పొంగూరు నారాయణ పేద ప్రజలవద్దకే 'హెల్త్ ఆన్ వీల్స్' కార్యక్రమం ద్వారా ఎక్స్ రే, స్కానింగ్, కంటి పరీక్షలు, రక్త పరీక్షలు అందుబాటులో తెచ్చారని, అంతేకాక వారికి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేయడం గొప్ప విషయమని చెప్పారు. మంత్రి నారాయణ సేవాభావానికి, ఆదర్శాలకి ఇది నిదర్శనమన్నారు. దాదాపు మూడు కోట్ల రూపాయల ఖర్చుకు వెనకాడకుండా పేదల కోసం ఈ సేవలందించడం విశేషమని కొనియాడారు. పలువురు జనసైనికులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# తలసేమియా పిల్లలకు బెడ్లు వితరణ



తలసేమియా పిల్లలకు బెడ్‌లను అందజేస్తున్న జైన్ అసోసియేషన్ సభ్యులు

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖ, తలసేమియా సెంటర్‌లో ఇటీవల తలసేమియా పిల్లల కోసం శ్రీ భగవాన్ మహావీర్ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ జె.పి జైన్ మరియు జైన్ అసోసియేషన్ సభ్యులు ధర్మేంద్ర జైన్, కమలేష్ జైన్‌లు 20బెడ్‌లను విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా జె.పి జైన్ మాట్లాడుతూ, తలసేమియా పిల్లలకి బెడ్స్ ఇవ్వడం చాలా సంతోషాన్ని ఇచ్చినదని, రాబోయే రోజుల్లో తమ ట్రస్ట్ తరపున వారికి తగు సహాయ సహకారాలని అందచేస్తామన్నారు. రెడ్ క్రాస్ ఛైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ చమర్తి జనార్ధన్ రాజు, మేనేజింగ్ కమిటీసభ్యులు బయ్యా ప్రసాద్, దాసరి రాజేంద్ర ప్రసాద్, తలసేమియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ సీత, సేవ ఎగ్జిక్యూటివ్ మెంబర్ షేక్ పర్వీన్, బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలు అనర్ధదాయకం



బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

నెల్లూరులోని బివిఎస్ ఎంసిజి హైస్కూల్‌లో ఇటీవల మహిళా శిశు సంక్షేమ శాఖ బాలల సంరక్షణ విభాగం వారి ఆధ్వర్యంలో 'బాల్య వివాహ ముక్త భారత్'పై బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. బాల్యవివాహాలు చేసుకోవడం నేరమని స్పష్టం చేశారు. ఐసిపిఎస్‌పిఒ సిహెచ్ సమత, నెల్లూరు ఎంఈఓ బి.తిరుపాల్, సహాయ కార్మిక అధికారి ఎన్ హరిబాబు పాల్గొన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిరోధించాలన్నారు. ఎక్కడ బాల కార్మికులు కనిపించినా తమకు తెలియజేయాలని చెప్పారు. అనంతరం బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. ఐసిపిఎస్ సుమ, కె.రామా రావు, ఎన్ హరిబాబు, రాంబాబు, పి.విజయ్‌జ్యోతి పాల్గొన్నారు.

# త్యాగధనుడు..శ్రీ పొట్టి శ్రీరాములు

ఆంధ్రరాష్ట్రం కోసం అసువులు బాసిన త్యాగధనుడు శ్రీ పొట్టి శ్రీరాములు అని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరులోని వైసీపీ కార్యాలయంలో తమ పార్టీలోని ఆర్యవైశ్యనాయకులతో కలిసి అమరజీవి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఉంటే తప్ప సమస్యలు తీరవని శ్రీ పొట్టి శ్రీరాములు ఆమరణదీక్ష చేసి, తన ప్రాణాలను సైతం అర్పించి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని సాధించారని కొనియాడారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా వాసి కావడం.. జిల్లా ప్రజల అదృష్టమన్నారు. కార్పొరేటర్ కామాక్షిదేవి, వైసీపీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు మంచికంటి శ్రీనివాసులు, నగర వాణిజ్య విభాగం అధ్యక్షులు జమిలి శ్రీనివాసులు, పి.మల్లికార్జున్, ఆర్యవైశ్య నాయకులు పబ్బిశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్‌కి.. కొత్త కార్యవర్గం



కొత్త కార్యవర్గాన్ని అభినందిస్తున్న వాకర్స్ సభ్యులు

నెల్లూరు ఏసి స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారు ఇటీవల కొత్త కార్యవర్గాన్ని నియమించుకున్నారు. అధ్యక్షులుగా షేక్ నసీర్ అహ్మద్, కార్యదర్శిగా శానంపూడి సుబ్బారాయుడు, కోశాధికారిగా సితారి రత్నయ్య, గౌరవాధ్యక్షులుగా బిరుదవోలు రామ్మోహన్ రెడ్డిలను ఏకగ్రీవంగా నియమించారు. ఎన్నికల అధికారిగా వినుకొండ వెంకటేశ్వర్లు వ్యవహరించారు. అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులునాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాదు, ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, ఆర్సీ ఎలెక్ట్ పలగాటి శ్రీనివాసులురెడ్డి, బెల్లం చెంచయ్యనాయుడు, కాగుళ్ల శివయ్య, మారుతి రావు, జీవి కృష్ణయ్య, ఏవీ సుబ్బరాజు, కొప్పు కోదండరామయ్య, మధుసూదనరావు, సోను, వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.




# సహకార ఉద్యోగుల ఆందోళన

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల సాధన కోసం సహకార ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు, ఈనెల16న నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలను పూర్తిచేసి, అప్పటివరకు మధ్యంతర భృతి ఇవ్వాలని, ఉద్యోగులకు గ్రాట్యుటీని చెల్లించాలని వారు కోరారు. రిటైర్‌మెంట్ వయసు పరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని, ఉద్యోగులకు 5లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్యబీమా సదుపాయాన్ని కల్పించాలని తదితర డిమాండ్లతో వారు జిల్లా సహకార అధికారి గురప్పకు వినతి పత్రం అందజేశారు. జేఏసీ నాయకులు కొండూరు గోవర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు ఆర్.రామానాయుడు, సురేష్ కుమార్‌రెడ్డి, లీగల్ సెల్ రమణమూర్తి, గౌరవ అధ్యక్షులు రాధయ్య, కోశాధికారి మల్లికార్జునగౌడ్ పాల్గొన్నారు.

# యూరియాకి కొరత లేదు

**- వ్యవసాయశాఖ జేడీ**

జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌కి సంబంధించి పంటపొలాలకు వినియోగించుకునేందుకు యూరియా ఎరువుకు కొరత లేదని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పంటలకు అవసరమైన 52,902 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, 52,173 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. డిసెంబర్ ఆఖరికి మరో 6వేల టన్నుల యూరియా కూడా జిల్లాకి రానుందని, ఈ నెల 17కి జిల్లాలో 37,064 మెట్రిక్ టన్నుల యూరియాను విక్రయించడం జరిగిందని ఆమె తెలిపారు.

## అమరజీవి నడయాడిన భూమిని..

# అద్భుతంగా తీర్చిదిద్దుతాం!

**• జువ్వలదిన్నెలో మంత్రి నారాయణ**



అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి నారాయణ, అజీజ్ తదితరులు

అమరజీవి వర్ధంతి సందర్భంగా మంత్రి నారాయణ ఈనెల 15న కావలి సమీపంలోని జువ్వలదిన్నెని సందర్శించారు. ఆంధ్రులకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు నడయాడిన ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అద్భుతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తొలుత శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం, అమరజీవి స్మారక భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, శ్రీ పొట్టి శ్రీరాములు తిరుగాడిన జువ్వలదిన్నెను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పించిన నేపథ్యంలో, ఉన్నతాధికారులతో కలసి ఈ ప్రాంతంలో క్షేత్రస్థాయి పరిశీలనలు చేస్తున్నామన్నారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేసిన 58రోజులకు గుర్తుగా 58అడుగుల విగ్రహాన్ని అమరావతిలో నెలకొల్పేందుకు 6.8 ఎకరాలు కేటాయించడం జరిగిందన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకే కాదు, దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడడానికి కూడా శ్రీ పొట్టి శ్రీరాములే ఆద్యులని ఆయన కొనియాడారు. వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగువారి ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలనే అర్పించారన్నారు. అమరావతిలో ఏర్పాటు కానున్న అమరజీవి విగ్రహానికి 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైజ్'గా నామకరణ చేయనున్నారని తెలిపారు. జువ్వలదిన్నెలో కోటీ 90 లక్షల రూపాయలతో ఆరోగ్య కేంద్రం ఏర్పాటుతోపాటు, గ్రామస్తుల కోరిక మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూడా ఏర్పాటు చేసేందుకు మంత్రి నారాయణ చొరవ తీసుకుని కృషిచేస్తున్నారని కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తెలిపారు. జువ్వలదిన్నెలో ప్రతి ఏటా నిర్వహించే శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతులకు అయ్యే ఖర్చునంతా తానే భరిస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా, అమరజీవి స్మారక భవనం నిర్వాహకులు ప్రకాష్, నాగేశ్వరరావుతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

**హార్బర్‌ను పరిశీలించిన మంత్రి :**

కావలి సమీపంలోని జువ్వలదిన్నెలో ఏర్పాటుచేసిన ఫిషింగ్ హార్బర్‌ను మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, కావలి ఎమ్మెలే కృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో కలిసి ఈనెల 15న సందర్శించారు. సుమారు 288 కోట్లతో ఏర్పాటు చేసిన హార్బర్‌ను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

# మార్కెట్‌లోకి 'స్మైల్ ఎకో' ఉత్పత్తులు

**--- విడుదల చేసిన..శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి ---**




ప్రపంచఖ్యాతి పొందిన పారిశ్రామికవాడ..శ్రీసిటీలోని స్మైల్ ఎకో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉత్పత్తులను మొట్టమొదటగా ఈనెల 15వతేదీ సోమవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున పరుచూరి సమక్షంలో శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్సార్) నిరీషా సన్నారెడ్డి ఆ కంపెనీ ఆవరణ నుంచి ఉత్పత్తుల వాహనాన్ని మార్కెట్‌కి తరలించారు. వ్యక్తిగత పరిశుభ్రత ఉత్పత్తులు (శానిటరీ న్యాప్‌కిన్స్) తయారుచేసే ఈ కంపెనీ, ఈ ఏడాది 5న విఎస్ఎన్ఎల్ మాజీ ఛైర్మెన్.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు, పద్మశ్రీ డాక్టర్ టి.హనుమాన్ చౌదరి చేతులమీదుగా ప్రారంభమైంది. శరవేగంగా ఉత్పత్తులు మొదలుపెట్టి సుమారు 10 లక్షల రూపాయల విలువచేసే తొలి ఉత్పత్తులను విజయవాడకు పంపింది.

**పారిశ్రామికవేత్తగా మారిన..శ్రీసిటీ ఉద్యోగి :**

శ్రీసిటీలో ఉద్యోగిగా ప్రస్థానం ప్రారంభించిన మల్లికార్జున ఇప్పుడు పారిశ్రామిక వేత్తగా రాణిస్తుండడం అభినందనీయమని ఈ సందర్భంగా మల్లికార్జునను శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి అభినందించారు. మల్లికార్జున మాట్లాడుతూ, వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యతతో ఉత్పత్తులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు.

# 'ఆనం' తెచ్చిన ఆనందం

**• మెట్టరైతుల్లో ఉప్పొంగిన ఉత్సాహం**

**ఎంతోకాలంగా సాగునీరందక ఇబ్బందులు పడుతున్న అనేక గ్రామాల మెట్ట ప్రాంత రైతాంగంలో మంత్రి ఆనం ఆనందం తెచ్చారు. ఆయా ప్రాంతాల బీడుభూములకు గలగలమంటూ సాగు నీరు ప్రవహించడంతో రైతులు పరమానందభరితులయ్యారు. మెట్ట ప్రాంతాల్లోని అనేక గ్రామాలకు సాగునీరందించిన ఘనత మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికే దక్కిందని, అపర భగీరథుడు మంత్రి ఆనం అని పలు గ్రామాల రైతులు ఈ సందర్భంగా కొనియాడారు. అటవీశాఖ భూసేకరణకి సంబంధించిన అనేకరకాల అడ్డంకులను సైతం అధిగమించి కష్ట సాధ్యమైన 42-ఆర్ కెనాల్‌ను తవ్వించి, నబ్బీనగరం-రాజవోలు నుంచి దిగువ గ్రామాలకు సాగునీటిని విడుదల చేసినందుకు ఆనంకి అక్కడి రైతులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.**



సోమశిల ఉత్తర కాలువ నుంచి 42ఆర్-మేజర్ కెనాల్‌కు నీటిని విడుదల చేస్తున్న మంత్రి ఆనం

ఆత్మకూరు సమీపంలోని వింజమూరు రోడ్డు వద్ద నబ్బీనగరం-రాజవోలు మార్గంలో సోమశిల ఉత్తర కాలువ నుంచి 42 ఆర్-మేజర్ కెనాల్‌కు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇటీవల సాగునీటిని విడుదల చేశారు. తొలుత, గంగమ్మతల్లికి జలహారతి ఇచ్చి, రైతులతో కలిసి మంత్రి మెట్ట పొలాలకు సాగునీరందించారు. ఆ కాలువ ద్వారానే కాక, మరో 6 ఉప కాలువల ద్వారా సాగునీరు ప్రవహించి, ఆత్మకూరు మండలంలోని 10 గ్రామాల్లో ఉన్న సుమారు 3వేల ఎకరాల భూములు సస్యశ్యామలం అవుతాయని మంత్రి ఆనం చెప్పడంతో రైతులు హర్షధ్వానాలు చేశారు. ఆ కాలువ పొడవు 8.60 కిలోమీటర్లు కాగా, కాలువ నీటి సామర్థ్యం 43 క్యూసెక్కులుగా ఉందని మంత్రి వివరించారు. సోమశిల ఉత్తరకాలువ రెండు జిల్లాలు, 5 నియోజకవర్గాలకు సాగునీటిని అందిస్తుందని చెప్పారు. జిల్లాలోని బాగా వెనుకబడిన మెట్టప్రాంతమైన ఆత్మకూరు మండలంలోని అనేక బీడు భూముల్లో నీళ్లు పారుతుంటే, అది చూసి రైతులు సంతోషిస్తుంటే తనకెంతో ఆనందంగా ఉందని కూడా ఆయన అన్నారు. ఆత్మకూరు మండలంలోని బోయిల చిరువెళ్ల, గొల్లపల్లి, నారంపేట, నాగులపాడు, చెర్లోయడవల్లి, రావులకొల్లు, నెల్లూరుపాలెం, ఆత్మకూరు, పేరారెడ్డిపల్లి, అల్లీపురం గ్రామాల్లోని పంటపొలాలకు సాగునీటి జలాలు ప్రవహిస్తాయన్నారు. అదేవిధంగా, కందుకూరు నియోజకవర్గంలోని రాళ్లపాడు వరకు కూడా సోమశిల ఉత్తరకాలువ ప్రవహిస్తుందన్నారు. త్వరలోనే 44-ఆర్ డిస్ట్రిబ్యూటరీ నుంచి ముస్తాపురం రైతులకు కూడా సాగునీటిన అందించేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే శ్రీహరినాయుడు, సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డి, సోమశిల ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కేశవ్‌చౌదరి, ఎంపిపి కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఆత్మకూరు ఆర్డీఓ పావని, తహశీల్దార్ పద్మజ, నీటి పారుదల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# అనుకున్న లక్ష్యాలను సాధించాలి

**• జిల్లా అధికారులతో లంకా దినకర్**

విద్య, వైద్యం తదితర రంగాల్లో అనుకున్న లక్ష్యాలను సాధించి జిల్లాను అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలపాలని 20 సూత్రాల పథకం అమలు ఛైర్మెన్ లంకా దినకర్ చెప్పారు. వికసిత్‌భారత్, స్వర్ణాంధ్ర సాధనకు అందరూ కలసికట్టుగా కృషి చేయాలన్నారు. ఇటీవల ఆయన నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో 20 అంశాల పథకాల అమలు విషయాన్ని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు



సమావేశంలో మాట్లాడుతున్న లంకా దినకర్, పక్కన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

అమలుచేస్తున్న పలు పథకాల అమలు తీరును ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లాలో యన్.టి.ఆర్ వైద్య సేవలో సుమారు 158 కోట్లతో 79 లక్షల మందికి వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. తల్లికి వందనం, మధ్యాహ్న భోజనం, గ్రామీణ నీటి సర ఫరా, ప్రధాన మంత్రి మాతృ వందనం, జనని శిశు సంక్షేమం తదితర పథకాల పురోగతిని సమీక్షించామని తెలిపారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, శాసన మండలి సభ్యులు బీదా రవిచంద్ర, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తది తరులు పాల్గొన్నారు.

# మాతృశ్రీ శారదాదేవి జయంతి



పేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

శ్రీ రామకృష్ణ పరమహంస ధర్మపత్ని మాతృశ్రీ శారదాదేవి 173వ జయంతి ఇటీవల నెల్లూరులో జరిగింది. నెల్లూరు, నవలాకులతోటలోని రామకృష్ణ మిషన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డా.ఎమ్. మోహన్‌రాజు పాల్గొని శ్రీ శారదాదేవి జీవిత విశేషాలను వివరించారు. తొలుత ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పెన్నానది తీరంలోని 500మంది దీనదయాళ్‌నగర్ వాసులకి ఉన్ని రగ్గులు పంపిణీ చేశారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి హృదానందజీ మహరాజ్, శ్రీలక్ష్మీ నారాయణ రావు పాల్గొన్నారు.



# సమాజానికి తిరిగివ్వడం.. మానవ ధర్మం

- శ్రీసిటీలో సాహితీవేత్త కిరణ్‌ప్రభ



కిరణ్‌ప్రభకి మెమెంటోను బహుకరిస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా ఆరోగ్యకరమైన, ఆనందదాయక జీవనం సాగిస్తున్న మనం సమాజానికి కొంత తిరిగివ్వడం మానవ ధర్మం అంటూ... ప్రఖ్యాత 'టాక్ షో' ప్రయోక్త, సాహితీవేత్త కిరణ్‌ప్రభ అన్నారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, "జీవన సాఫల్యం, సమాజానికి తిరిగివ్వడం" అనే అంశంపై మాట్లాడారు. పలువురు మహనీయుల జీవితగాథలను, వారు చేసిన సమాజ సేవ, త్యాగాలు, గుప్త దానాల గురించి కళ్ళకు కట్టినట్టు వివరించారు. ఇతరులకు సాయం చేయడంలోనే తృప్తి ఉందన్నారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనను అభినందించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా కిరణ్‌ప్రభ దంపతులను సత్కరించారు. అనంతరం, శ్రీసిటీ సమీపంలోని ఇరుగుళం జిల్లా పరిషత్ హైస్కూల్ సందర్శించిన కిరణ్ ప్రభ, అక్కడ విద్యార్థులను ఉద్దేశించి క్రమశిక్షణ, దేశభక్తి, విద్యలో ఎలా రాణించాలి, చెడు అలవాట్లకు దూరంగా ఎలా ఉండాలి వంటి పలు అంశాలపై ప్రసంగించారు. శ్రీసిటీ పీఆర్వో పల్లేటి బాలాజీ సమన్వయకర్తగా వ్యవహరించారు.

# హెల్మెట్ ఉంటేనే.. శ్రీసిటీలోకి అనుమతి



'నో హెల్మెట్ - నో ఎంట్రీ' అంటున్న శ్రీసిటీ పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది

తిరుపతి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు శ్రీసిటీ పోలీసులు శ్రీసిటీ సెక్యూరిటీ సిబ్బంది సహకారంతో 'నో హెల్మెట్–నో పెట్రోల్' నిబంధన అమలు చేయడమే కాక, ద్విచక్ర వాహనదారుల భద్రతని దృష్టిలో పెట్టుకుని సోమవారం ఉదయం నుంచి నో హెల్మెట్ –నో ఎంట్రీ' నిబంధనను అమలుచేశారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు శ్రీసిటీలో ప్రవేశానికి అనుమతి లేదని స్పష్టంచేశారు. హెల్మెట్ ధరించిన వాహనదారులను ఆపి అభినందనలు తెలియజేశారు. అంతేకాదు, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిపై చట్ట ప్రకారం జరిమానాలు విధించారు. శ్రీసిటీ సీఐ శ్రీనివాస్, ఎస్సై సుధీర్ కుమార్‌రెడ్డి, శ్రీసిటీ సెక్యూరిటీ చీఫ్ వై.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఉదారంగా ప్రభుత్వ సాయం



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే సోమిరెడ్డి

కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలకు ఉదారంగా సాయం అందుతోందని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. నెల్లూరు వేదాయపాళెంలోని ఆయన కార్యాలయంలో ఇటీవల ఆయన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల కష్టాలను దృష్టిలో ఉంచుకుని సీఎం రిలీఫ్ ఫండ్‌కి వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి, సాయం అందజేస్తున్నారన్నారు. అనంతరం సర్వేపల్లిలోని 59మందికి రూ.33.54లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే ఇప్పటిదాకా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5.75 కోట్లకు పైగానే సాయం అందిందని ఆయన తెలిపారు.

# పార్టీ శ్రేణులకు అండగా ఉంటా..



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి నియోజకవర్గంలోని తమ పార్టీ శ్రేణులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల ఆయన వెంకటగిరిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని, ఇప్పటికే వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేశారని టీడీపీ నేతలపై ధ్వజమెత్తారు. వాకాడులో ఉన్న వైఎస్ఆర్సీపి నాయకుడు నజీర్‌కు నెల్లూరు పోలీసులు నోటీసు ఇవ్వడం, వారి బంధువుల వద్ద సంతకాలు తీసుకోకుండా ఆయన్ను తీసుకువెళ్లడం దేనికి నిదర్శనమని ఆయన ప్రశ్నించారు. నిబంధనలను అతిక్రమించిన అధికారుల వ్యవహారాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేసి తాము అధికారంలోకి వస్తే.. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలి



ప్రమాణస్వీకారోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ అన్నారు. పట్టణంలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 15వతేదీ ఆలయ కమిటీ నూతన ఛైర్మెన్, పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారం జరిగింది. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కమిటీ ఛైర్మెన్‌గా ఆరికట్ల బాలకృష్ణంనాయుడు, సభ్యులుగా అరుణ్‌కుమార్, దిలీప్‌కుమార్, గురునాథం, భాగ్యలక్ష్మి, మమత, విజయ, జయలక్ష్మి ప్రమాణస్వీకారం చేశారు. కిరణ్‌కుమార్, శ్రీనివాసులు, దయాకర్, శ్రీనివాస్, శ్రావణి పాల్గొన్నారు.

# ఉద్యోగులకు తిరుపతి ఇబ్బందికరం

- ఏపీపీఆర్డీఈఏ రాష్ట్ర గౌరవాధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్



గూడూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుండి జిల్లా కేంద్రమైన తిరుపతికి రాకపోకలు సాగించడం కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇబ్బందికరమని ఏపీ పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ అన్నారు. గూడూరు టవర్ క్లాక్ సెంటర్లో గూడూరును జిల్లా చేయాలని కోరుతూ గూడూరు జిల్లా సాధన సమితి జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 9వ రోజుకు చేరుకున్నాయి. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎస్. మహబూబ్ బాషా, కార్యదర్శి ఎన్.మోహన్ ఆధ్వర్యంలో ఆ సంఘ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు 50మంది దీక్షల్లో కూర్చున్నారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే సునీల్ కుమార్ గూడూరు ప్రజల ఆకాంక్షను రెండుసార్లు అసెంబ్లీలో వినిపించారని, పాలకులు స్పందించి గూడూరును జిల్లా నైనా చేయాలి, లేనిపక్షంలో నెల్లూరులో కలపాలని డిమాండ్ చేశారు. షేక్ మహబూబ్ బాషా, జేఏసీ సెంట్రల్ కమిటీ కన్వీనర్ బి.దశరథరామిరెడ్డి, జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లిటిల్ ఏంజెల్స్‌కి 'ట్రైల్ బ్లేజర్ అవార్డు'



అవార్డునందుకుంటున్న ఎల్ఏపి స్కూల్ కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి

గూడూరులోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ ఆంధ్రప్రదేశ్‌లోని టాప్ 20 సిబిఎస్ఇ పాఠశాలల్లో స్థానం పొంది 'ఇటి టెక్ఎక్స్ – ట్రైల్ బ్లేజర్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ 2025–26' అవార్డును కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా స్కూలు కరస్పాండెంట్ బి.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల నిబద్ధత, ఉత్తమ బోధనా పద్ధతులతోనే ఈ అవార్డు లభించిందని సంతోషం వ్యక్తం చేశారు.

# చెకుముకి విజేతలకు బహుమతులు

గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చిల్లకూరు మండల స్థాయి చెకుముకి పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినీవిద్యార్థులకు ఇటీవల బహుమతులు పంపిణీ చేశారు. స్థానిక ఎల్.ఏ.పి. స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డా. కుడుముల వెంకట నారాయణ దాతృత్వంలో విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. జే.వి.వి ఉపాధ్యక్షులు చెంచునారాయణ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులలో మూఢనమ్మకాలు పోగొట్టేందుకు ప్రతి సంవత్సరం చెకుముకి సైన్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నాగరాజు, పురుషోత్తమరావు, హెచ్.ఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# శిరస్త్రాణం తప్పక ధరించాలి



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గీతాకుమారి, సీఐలు, ఎస్సైలు

ద్విచక్రవాహనదారులు శిరస్త్రాణం తప్పక ధరించాలని గూడూరు డీఎస్పీ డాక్టర్ గీతాకుమారి తెలిపారు. ఇటీవల ఆమె గూడూరు పట్టణ సమీపంలోని జాతీయ రహదారి కూడలి వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించి, వాహనదారులకు అవగాహన కల్పించారు. సీఐలు శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, ఎస్సైలు మనోజ్ కుమార్, తిరుపతయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకి లయన్స్ పలసరుకులు



లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ, టౌన్ & వెస్ట్ క్లబ్‌ల పర్మినెంట్ ప్రాజెక్ట్ కార్యక్రమంలో భాగంగా ఇటీవల పలువురు వృద్ధులకి పల సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పర్మినెంట్ ప్రాజెక్ట్ ఛైర్మెన్ వి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పర్మినెంట్ ప్రాజెక్ట్‌కి మరికొంత ఫండ్‌ని సేకరించి ఇంకొంతమందికి కూడా పల సరుకులు పంపిణీ చేయాలన్నారు. వైజేపీ క్లబ్ ప్రెసిడెంట్ సుధాకర్, సెక్రటరీ డి.మురళీకృష్ణ, ట్రెజరర్ గోపినాథ్‌రెడ్డి, టౌన్ క్లబ్ ట్రెజరర్ ప్రసాద్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# సంయుక్త సేవాసమితి ఆధ్వర్యంలో.. తాళ్ళమ్మ దేవస్థానంలో పార్కు సుందరీకరణ



గూడూరు గ్రామ దేవత తాళ్ళమ్మ దేవస్థానంలోని పార్కును గూడూరు ఎమ్మెల్యే డా. పాశం సునీల్‌కుమార్ సూచనలతో సంయుక్త సేవాసమితి దాతృత్వంతో పిల్లలు ఆడుకునేందుకు అనుగుణంగా సుందరీకరణ చేశారు. దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం, పిల్లలకు ఆటవిడుపుగా ఈ పార్కును అభివృద్ధి చేశామని సంయుక్త సేవాసమితి వారు తెలిపారు.




### ఉద్యోగ భద్రత కల్పించాలంటూ..

## సీఆర్‌సీల ధర్నా

తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యంగా ఉద్యోగ భద్రత కల్పించాలంటూ సమగ్రశిక్ష పాఠశాల విద్యా శాఖలో గత పదిహేనేళ్ళుగా పనిచేస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌సీ)లు, క్లస్టర్ మొబైల్ రిజర్వ్ టీచర్లు (సీఆర్‌ఎంటీలు) ఆందోళన బాట పట్టారు. ఏపీ క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల15న నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట వారు ధర్నాందోళన చేశారు. సీఆర్‌ఎంటీలకు ఏ–బీ క్లస్టర్ ప్రతిపాదిత విధానాన్ని విరమింపజేయాలని, విద్యా శాఖలో తమను విలీనం చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. అదేవిధంగా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా, తమకు నెలసరి వేతనం రూ. 40వేలకు పెంచాలని, అర్హత కలిగిన వారందరికీ డీఎస్‌సీలో వెయిటేజ్ ఇవ్వాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, ఇఎస్‌ఐ–ఇపీఎఫ్ తదితర సదుపాయాలు కూడా ఉండేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విన్నవించుకున్నారు. ఆమేరకు వినతి పత్రాన్ని వారు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉన్న అధికారులకు అందజేశారు.

## ఆటోలతో నిరసన ర్యాలీ

కలువాయి మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపొద్దంటూ గత పదిరోజుల నుంచి నిరసన కార్యక్రమాలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈనెల 13న కలువాయిలో ఆటోలతో పెద్దఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. ఆటోకార్మికులు, పలు సంఘాల నాయకులు, కార్యకర్తలు కలిసి మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్ళి, తమ నిరసనలు తెలిపారు. జేఏసీ ఆధ్వర్యంలో, కలువాయి బస్టాండ్ సెంటర్‌లో ప్రతిరోజూ వినూత్నంగా తమ అసంతృప్తిని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉండే అన్ని పార్టీల నాయకులు ఈ ఆందోళనలకు మద్దతిస్తున్నారు. కూటమి నాయకులు, ఉపాధ్యాయ సంఘాల వారు, సీఐటియు, వామపక్ష పార్టీలు అందరూ కలిసి కలువాయిని నెల్లూరుజిల్లాలోనే ఉంచాలని ముక్తకంఠంతో కోరుతున్నారు. కలువాయి మండలాన్ని తిరుపతిలో కలిపితే, ప్రతి చిన్నపనికీ తిరుపతికి వెళ్లాలంటే ప్రజలు అనేకరకాల ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ప్రభుత్వం ఈ విషయాలను గమనించి వెంటనే కలువాయిని నెల్లూరుజిల్లాలోనే ఉంచేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల.. మహా ధర్నా

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సదుపాయాలను చిన్నారులకు అందించేందుకు వెంటనే ప్రభుత్వం బడ్జెట్‌ని పెంచాలని, ఎంతోకాలంగా ఆ కేంద్రాల్లో పనిచేస్తున్న తమకు జీతాలు పెంచాలని అంగన్‌వాడీ మహిళలు భారీసంఖ్యలో ఇటీవల నెల్లూరు కలెక్టరేట్ వద్దకు చేరుకుని మహా ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్ల కష్టాలు తీర్చాలంటూ వారు పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో కలెక్టరేట్ ప్రాంతమంతా దద్దరిల్లింది. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని, తమకు స్టోరేజీ ఎక్కువగా ఉండే 5జీ ఫోన్లు అందజేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పేదవర్గాల వారికి గర్భిణులకి, శిశువులకి సేవలందిస్తున్న తమకు గత ఆరేళ్ళుగా వేతనాలు పెంచలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు పెంచుతామని హామీలిచ్చారు కానీ, నేటికీ అమలు కాలేదని వారు తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా తమకు కనీసవేతనంగా 24 వేలు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. గత సమ్మెకాలంలో నేతలు ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరారు. ఈ ధర్నాలో యూనియన్ గౌరవాధ్యక్షురాలు రెహెనాబేగం, జిల్లా అధ్యక్షురాలు ఎల్‌వీ శేషమ్మ, కోశాధికారి మల్లెమ్మ, నాయకురాళ్ళు కామాక్షమ్మ, సంపూర్ణమ్మ, రాధమ్మ తదితరులతో పాటు సీఐటీయు నాయకులు పాల్గొన్నారు.

# రూపాయి పతనం: సంక్షోభమా? వ్యూహంలో మార్పా?




ప్రపంచ ఆర్థిక యవనికపై అమెరికన్ డాలర్ జైత్రయాత్ర కొనసాగుతున్న వేళ, భారత రూపాయి విలువ ఆల్-టైమ్ కనిష్ట స్థాయిలకు పడిపోవడం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. గత రెండు మూడు రోజులుగా రూపాయి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.91.14 స్థాయికి పడిపోయింది. సాధారణంగా ఇటువంటి సమయాల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బిఐ) తన వద్ద ఉన్న విదేశీ మారకపు నిల్వలను మార్కెట్లోకి విడుదల చేసి రూపాయి విలువను పెంచే ప్రయత్నం చేసేది. కానీ, ఈసారి అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఆర్బీఐ కొంత 'వ్యూహాత్మక మౌనం' పాటిస్తున్నట్లు అర్థమవుతోంది.

### కృత్రిమ సర్దుబాట్లకు కాలం చెల్లిందా?

గతంలో రూపాయి విలువ పడిపోతున్నప్పుడు దానిని కాపాడటమే పరమావధిగా ఆర్బీఐ భావించేది. అయితే, ఈసారి భారత్ ఒక కొత్త ఆర్థిక సిద్ధాంతాన్ని అనుసరిస్తున్నట్లు కనిపిస్తోంది. దీనినే 'లెట్ ఇట్ ఫైండ్ ఇట్స్ ఓన్ లెవెల్' (దాని విలువను మార్కెట్ నిర్ణయించనివ్వడం) అంటారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, కరెన్సీ విలువను కృత్రిమంగా కాపాడటానికి ప్రయత్నిస్తే మన వద్ద ఉన్న విలువైన విదేశీ మారకపు నిల్వలు వేగంగా కరిగిపోతాయి. ప్రపంచవ్యాప్తంగా చైనా, జపాన్ వంటి దేశాలు ఇప్పటికే తమ కరెన్సీల విషయంలో మార్కెట్ ఆధారిత సర్దుబాట్లకు మొగ్గు చూపుతున్నాయి. భారత్ కూడా అదే దారిలో నడవడం వల్ల దీర్ఘకాలంలో రూపాయికి స్థిరత్వం లభిస్తుంది.

### సంక్షోభం కాదు, సర్దుబాటు..

ప్రస్తుతం ఇది కేవలం రూపాయి సమస్య కాదు. ప్రపంచంలోని ప్రధాన కరెన్సీలైన యూరో, యెన్, బ్రిటిష్ పౌండ్ కూడా డాలర్ ముందు విలవిల్లాడుతున్నాయి. ఇతర కరెన్సీలతో పోలిస్తే.. భారత రూపాయి పతనం శాతం చాలా తక్కువ. నిపుణుల విశ్లేషణ ప్రకారం, అమెరికా తన వడ్డీ రేట్లను పెంచడంవల్ల ప్రపంచ వ్యాప్తంగా డాలర్ అసాధారణంగా బలపడింది. దీని ప్రభావం వల్ల జపాన్ కరెన్సీ 'యెన్', బ్రిటన్ 'పౌండ్', ఐరోపా దేశాల 'యూరో' వంటి శక్తివంతమైన కరెన్సీలు కూడా 10 శాతం నుండి 15 శాతం వరకు విలువను కోల్పోయాయి. కానీ, భారత రూపాయి పతనం కేవలం 3 శాతం నుండి 5 శాతం మధ్యలోనే ఉంది. అంటే, అంతర్జాతీయ విపణిలో డాలర్ ముందు రూపాయి ఇతర కరెన్సీల కంటే మెరుగైన సామర్థ్యాన్నే కనబరుస్తోంది.

రూపాయి పతనం అనేది మన ఆర్థిక వ్యవస్థ బలహీనత వల్ల జరగడం లేదు, అది కేవలం డాలర్ అస్థిరమైన బలంతో వస్తున్న మార్పు మాత్రమే. అందుకే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూపాయిని కాపాడటానికి తన వద్ద ఉన్న విదేశీ మారకపు నిల్వలను విచ్చలవిడిగా ఖర్చు చేయడం లేదు. రూపాయిని కృత్రిమంగా రక్షించే ప్రయత్నం చేయకుండా మార్కెట్ శక్తులకు వదిలేయడం వల్ల, అది ఒక సహజమైన స్థాయికి చేరుకుంటుంది. దీనివల్ల మరో సానుకూల అంశం ఏమిటంటే, ఇతర దేశాల కరెన్సీలతో(ఉదాహరణకు యూరో లేదా యెన్) పోల్చినప్పుడు రూపాయి వాస్తవానికి బలం పుంజుకుంది. ఇది విదేశీ పెట్టుబడిదారులకు భారత్ ఒక సురక్షితమైన, స్థిరమైన మార్కెట్ అనే నమ్మకాన్ని కలిగిస్తోంది. రూపాయి ఇలా తన సహజ విలువను అట్టి పెట్టుకోవడం వల్ల ఎగుమతులు పెరిగి, దీర్ఘకాలంలో మన ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

రూపాయి విలువ తగ్గడం వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ వస్తువులు (ముఖ్యంగా ఐటీ సేవలు, ఫార్మా, టెక్స్‌టైల్స్) చౌకగా లభిస్తాయి. ఇది మన దేశ ఎగుమతులు పెరగడానికి, తద్వారా విదేశీ మారక ద్రవ్యం దేశంలోకి రావడానికి దోహదపడుతుంది. రూపాయి విలువ కొంత మేర తగ్గితే, విదేశీ పెట్టుబడిదారులకు భారతీయ ఆస్తులు (స్టాక్స్, రియల్ ఎస్టేట్) తక్కువ ధరకే లభిస్తాయి. ఇది దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరగడానికి దారితీస్తుంది. భారత జీడీపీ వృద్ధి రేటు ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధికంగా ఉంది. మన బ్యాంకింగ్ వ్యవస్థ బలంగా ఉంది, పారిశ్రామిక ఉత్పత్తి నిలకడగా సాగుతోంది. ఇతర పాశ్చాత్య దేశాలతో పోలిస్తే, భారత్‌లో ధరల పెరుగుదల నియంత్రణలోనే ఉంది. రూపాయిని ఇలా స్వేచ్ఛగా వదిలేస్తే, అది ఒక స్థిరమైన స్థాయికి చేరుకున్నాక మళ్ళీ బలం పుంజుకుంటుంది. కృత్రిమంగా అడ్డుకట్ట వేయడం కంటే, సహజమైన పతనం ద్వారా మార్కెట్ స్థిరపడటం ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అత్యవసర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కోవడానికి భారత్ వద్ద సుమారు 600 బిలియన్ డాలర్లకు పైగా ఫారెక్స్ నిల్వలు ఉన్నాయి. బంగారపు నిల్వలు కూడా తగినంత ఉన్నాయి.

### అంతర్జాతీయ సవాళ్లు - స్వదేశీ పరిష్కారాలు

ప్రస్తుతం అమెరికా విధిస్తున్న కొత్త వాణిజ్య సుంకాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు రూపాయిపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఇటువంటి తరుణంలో కేవలం కరెన్సీ విలువను చూసి భయపడటం కంటే, దేశీయంగా ఉత్పత్తిని పెంచడం, దిగుమతులపై ఆధారపడటం తగ్గించుకోవడం ప్రధాన పరిష్కార మార్గాలు. ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా' ద్వారా తయారీ రంగాన్ని బలోపేతం చేస్తుండటం రూపాయికి దీర్ఘకాలిక భరోసాను ఇస్తుంది. మన ఆర్థిక పునాదులు బలంగా ఉన్నంత కాలం, కరెన్సీ హెచ్చుతగ్గులు దేశ ప్రగతిని ఆపలేవు. మారుతున్న ప్రపంచ ఆర్థిక క్రమంలో భారత్ తీసుకున్న ఈ 'వ్యూహాత్మక నిర్ణయం' భవిష్యత్తులో శుభపరిణామాలకు దారితీస్తుందని మనం ఆశించవచ్చు.



**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**

# ఉపాధి పనులకు.. 530 కోట్లు

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేసేందుకు 530కోట్ల రూపాయల నిధిని కేటాయించారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్లు, బీటీ–గ్రావెల్ రోడ్లు నిర్మించడం, కాలువలు–చెరువుల పనులు, పూడికతీత పనులు, పండ్లతోటల పెంపకం, చెక్‌డ్యామ్‌ల మరమ్మతుల వంటి వాటికి ఆ నిధులను వినియోగించనున్నారు. జిల్లాలోని 5లక్షల మందికి 1.06 కోట్ల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు డ్వామా అధికారులు చెప్తున్నారు.

# పల్స్‌పోలియోకి.. విస్తృతంగా ఏర్పాట్లు

జిల్లాలో ఈనెల 21 నుంచి 23వతేదీ వరకు జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో అయిదేళ్ల లోపు వయసున్న పిల్లలు 2,94,604 మంది ఉన్నారని, వారికి 52పీహెచ్‌సీలు, 28 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 2,396 బూత్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాటితో పాటు 82 సంచార బూత్‌లు, 85 ట్రాన్సిట్ బూత్‌లు ఉంటాయని, 10,339 మంది వ్యాక్సినేటర్ల ద్వారా పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు నిర్ణయించారు. డీఎంఅండ్‌హెచ్ఓ సుజాత ఆధ్వర్యంలో నూటికి నూరుశాతం పల్స్ పోలియో లక్ష్యాలు సాధించేందుకు వైద్యఆరోగ్యశాఖ సమాయత్తమవుతోంది.

## పౌరోహిత్యం

సమాజాభ్యుదయానికి
నీవంతు కృషిధార
అనే మానవీయతను సృష్టిస్తే
నీది నాకేమీ వద్దు
నాది నీకూ వద్దన్న
వైపరీత్యం... వితండవాదం
మనుషుల్ని విభజించే ఇనుపతెరల్ని త్రెంచి
వసుధైక కుటుంబనాద ఉషస్సు
ప్రబలి మనుషుల మధ్య మనోద్వారా
తోరణానికి ఓ కొత్త అల వచ్చి
సముద్ర తరంగంలా విరుచుకుపడుతుంది

సమాజక్షేత్రంలో
మానవతాసూర్యుడు విరబూయాలే గాని
నవనవోన్మేష సుగంధాలు విరజిమ్మాలే గాని
తన ధర్మం తనదిగా చేసుకొనే
చేటుకాలాన్ని పెకిలించాలి.

దేశం మొహంమ్మీద చెమట చారికలు
తుడిచేసి
ఈ జాతికి సమన్యాయం మంత్రజలం
తీర్థంగా ఇవ్వలేకపోవడం
బధిరుడి ముందు శంఖారావం లాంటిది.

భూమిపుత్రుల చెమటతో తడిసిన
సారవంతమైన మాగాణి భూముల్లో
పరివర్తన ఆశారేఖలు చిగురించి
మానవ కళ్యాణానికి పునాది అవ్వాల్సి ఉంది

అప్పుడే
సామాజిక దురన్యాయం
చెదలు పట్టిన చెట్టవుతుంది
అప్పటివరకూ మనిషిలోని
దురహంకార అభిజాత్యానికి
మందు కన్పించని ప్రస్థానం వర్ధిల్లుతుంది
దాన్ని తొలగించే ఆయుధం
బోధనగా వెల్లివిరియాలి.

మనిషి మూలాల్లో
చిగురులు జనియించేదాకా
మానస పరివర్తనలో
కృషీవలురు కృషి సల్పుతూనే ఉండాల్సి ఉంటుంది

ఆ కృషి నిరంతరాన్వేషణా
పౌరోహిత్యమై
మానవ సమాజాన్ని
మేల్కొలిపే దిశగా
సన్మాయిరాగం ప్రతిష్టించాలి!



**చిన్ని నారాయణరావు**
94402 02942

# కలెక్టర్‌కి.. సీఎం ప్రశంస

## 'చాంపియన్ రైతు' కార్యక్రమానికి అభినందనలు



నెల్లూరుజిల్లాలో 'చాంపియన్ రైతు' పేరుతో వినూత్న కార్యక్రమం చేపట్టిన కలెక్టర్ హిమాన్షు శుక్లాను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశంసించారు. ఈనెల 17న అమరావతిలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేకించి నెల్లూరుజిల్లా కలెక్టర్ రైతుల కోసం చేపట్టిన అవగాహన కార్యక్రమాలను విని సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ ఓ ఛాంపియన్ ఫార్మర్‌ను ఎంపికచేసి, ఆ రైతు ద్వారా మిగతావారికి వ్యవసాయ పనులపై మరింత అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ ముఖ్యమంత్రికి తెలియజేశారు. జిల్లాలో కేవలం వరి మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ పంటలు పండించేలా చూస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఛాంపియన్ ఫార్మర్ అనే ఇనిషియేటివ్ బాగుందని, ఈ విధంగా శాఖలన్నీ ఇంటిగ్రేట్ చేసి రైతులకు ప్రయోజనకరంగా మార్పు వచ్చేది నిరూపించారన్నారు. అంతేకాదు, హిమాన్షును అమరావతిలోనే ఉండమని కోరాముని... కానీ, ఏదైనా ఒక జిల్లాలో ప్రభావవంతంగా పనిచేస్తానని కోరడంతో ఆయనను నెల్లూరు కలెక్టర్‌గా నియమించడం జరిగిందని, అక్కడ బాగా పనిచేస్తున్నారని ముఖ్యమంత్రి చెప్పారు. 'కీప్ ఇట్ అప్ హిమాన్షు' అంటూ కలెక్టర్‌ని అభినందించారు.

## 19న ప్రభుత్వోద్యోగుల గ్రీవెన్స్ డే

ఈనెల 19న మధ్యాహ్నం 12.30 గంటలకు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్‌డే నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా మూడవ శుక్రవారం ఈ గ్రీవెన్స్‌డేని ప్రత్యేకంగా నిర్వహిస్తామని, ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

## రాపూరులో... నిరసన

తిరుపతి జిల్లా మాకు వద్దనే వద్దు.. కన్నతల్లి లాంటి నెల్లూరుజిల్లాయే కావాలంటూ రాపూరు మండలంలో ఇటీవల ప్రజలు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. రాపూరు మండలాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరుపతిలో కలపొద్దని కోరుతూ రాపూరు పాత బస్టాండ్ వద్ద నుంచి బాలాజీ కాంప్లెక్స్ కూడలి వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు.




విజయవాడలో డిసెంబర్ 12న జరిగిన 'మిస్ టీన్ ఆంధ్రా' పోటీలలో ఫస్ట్ రన్నరప్‌గా నిలిచిన మన నెల్లూరుకి చెందిన జెవిరెడ్డి శ్రీధర్‌రెడ్డి - అనూషల కుమార్తె సహస్రారెడ్డి.

# పర్యావరణమే పరమావధిగా.. 'చెట్టు=తల్లి'




'చెట్టు = తల్లి' బృందాన్ని అభినందిస్తున్న ముఖ్యఅతిథులు బీజేపీ సీనియర్ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, 'లాయర్' సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి

## అందరినీ ఆకట్టుకుంటున్న షార్ట్ ఫిలిమ్

'తల్లి పేరుతో ఒక మొక్కను నాటండి' అనే ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుకు స్పందించి, పర్యావరణ పరిరక్షణే పరమావధిగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని, చెట్లను సంరక్షించుకోవాలనే సందేశంతో నెల్లూరు కళాకారుల బృందం తాజాగా రూపొందించిన 'చెట్టు=తల్లి' షార్ట్ ఫిలిమ్ అందరి ప్రశంసలు అందుకుంటోంది. ప్రముఖ నటుడు-దర్శకుడు 'కళాంజలి అనంత్' నేతృత్వంలో రూపొందించిన ఈ షార్ట్ ఫిలిమ్‌లో..మానవాళికి ప్రాణవాయువులందించే చెట్లను నాశనం చేయకూడదని, చెట్లే లేకపోతే ప్రపంచమే లేదని, 'వృక్షో రక్షతి రక్షితః' అన్నట్లుగా వృక్షాలను రక్షిస్తే అవే మనల్ని రక్షిస్తాయనే సామాజిక సందేశం వీక్షకులను ఆకట్టుకుంది. ఇటీవల నెల్లూరులోని కృష్ణచైతన్య కళాశాల సమావేశమందిరంలో ఈ షార్ట్ ఫిలిమ్ లాంచింగ్ సెలబ్రేషన్‌లో 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెట్లను ప్రతిఒక్కరూ కాపాడుకోవాలన్నారు. పల్లెలు నగరాలన్నీ ఇప్పుడు కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్నాయని, ఆ దుస్థితి పోవాలంటే ఇకనైనా అందరూ ప్రకృతిని, పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. బీజేపీ రాష్ట్ర అధికారప్రతినిధి, సీనియర్ నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ, చెట్లను-నదులను, ప్రకృతిని పూజించుకోవడం భారతీయ సంప్రదాయమన్నారు. తల్లి పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలనే ప్రధాని పిలుపుతో ఇలాంటి స్ఫూర్తిదాయకమైన షార్ట్ ఫిలిమ్‌ను రూపొందించడం నిజంగానే అద్భుతమంటూ ఆయన కళాంజలి అనంత్ ప్రతిభని కొనియాడారు.

### చెట్టు..తల్లితో సమానమంటూ..సందేశం

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. కళాంజలి సంస్థకి ఆత్మీయుడు.. పిక్‌నిక్ ఐస్‌క్రీమ్స్ అధినేత వీరిశెట్టి హజరత్‌బాబు, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ పి.హరికృష్ణ, ఎం.ప్రసన్నాంజనేయులు నలుబోలు బలరామయ్యనాయుడు, జయప్రకాష్, హాస్యనటుడు దోర్నాల హరిబాబు, కవయిత్రులు గోవిందరాజుల సుభద్రాదేవి, తోట సులోచన తదితరులతో పాటు అనేకమంది ప్రముఖులు పాల్గొని 'చెట్టు తల్లి' అద్భుతంగా ఉందంటూ ఆ టీమ్‌ని అభినందించారు. ఈ షార్ట్ ఫిలిమ్‌లో శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా వాసు ప్రత్యేకపాత్రను పాత్రోచితంగా పోషించడం విశేషం! నటీనటులు ఎవరికి వారు అద్వితీయంగా తమ పాత్రలను పోషించారు. ధీరజ్-సుఫియా పర్వేజ్‌ఇద్దరూ కొత్తవారే అయినా, ఆయా పాత్రల్లో జీవించారంటే అతిశయోక్తి కాదు. చిన్నారి చిట్టితల్లులకి..తల్లిలాంటి చెట్టుతల్లిపై ఎంతటి మమకారం



'చెట్టు=తల్లి' షార్ట్‌ఫిల్మ్‌ని లాంచ్ చేస్తున్న 'లాయర్' సంపాదకులు ప్రభు

ఉంటుందో చూడాలంటే ఈ చెట్టుతల్లినే చూడాలి అన్నట్లుగా..ఈ షార్ట్ ఫిలిమ్ అందరి కరతాళధ్వనులందుకుంటోంది. ఈ షార్ట్ ఫిలిమ్‌కి కథ-మాటలు-స్క్రీన్‌ప్లే అన్నీ కూడా 'కళాంజలి' అనంత్. ఆయన దర్శకత్వంలో నటీనటులు డా.కెకె రామచంద్రమూర్తి, దువ్వూరు బెనర్జీ, శిరీష, గవాస్కర్, నాగమణి, నీలిమ, సంగీత దర్శకుడు సంగీత్ సౌరభ్, పాటల రచయిత మద్దూరు శ్రీనివాసులు, కెమెరా ఏ.రాజేష్, వాయిస్‌ఓవర్ జి.అరుణ్, నిర్మాత పి.శివ కుమార్ తదితరులంతా 'చెట్టు=తల్లి'కి జీవం పోశారు.

### యూట్యూబ్‌లో వైరల్‌గా మారిన 'చెట్టు=తల్లి'

చెట్టు=తల్లి (చెట్టు-ఈజ్ ఈక్వల్ టు తల్లి)..షార్ట్ ఫిలిమ్‌ని యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడంతో అది వైరల్‌గా మారింది. పచ్చదనంపై శ్రద్ధ లేక, కాలుష్యం పేరుకుపోతున్నా పట్టించుకోక, అడవులను నరికేసుకుంటూ..ఊళ్లల్లో ఉన్న చెట్లను కొట్టేసుకుంటూ పర్యావరణం పట్ల చాలామంది అత్యంత నిర్లక్ష్యంగా ఉంటున్న నేటి తరుణంలో, చెట్టు విశిష్టత ఎంత గొప్పదో..వాటిని ఎందుకు కాపాడుకోవాలో కళ్లకు కట్టేవిధంగా వివరిస్తూ.. ఈ షార్ట్ ఫిలిమ్‌ని రూపొందించడం పట్ల సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. 'ఎవ్విరిథింగ్ అనంత' అనే ఛానల్ ద్వారా దీనిని అందరూ తిలకించవచ్చని ఈ సందర్భంగా కళాంజలి అనంత్ వీక్షక లోకానికి తెలియజేశారు.

## తమిళనాడులో.. తెలుగువారి సమస్యలపై చర్చ

- ఆచార్య సీఎంకెరెడ్డితో ఆర్‌డీ విల్సన్ భేటీ




ఆచార్య సి.యం.కె.రెడ్డిని సత్కరిస్తున్న తెలుగు సంస్కృత అకాడమీ ఛైర్మెన్ ఆర్.డి.విల్సన్

అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య సీఎంకే రెడ్డి ఇటీవల ఆంధ్రప్రదేశ్ తెలుగు-సంస్కృత అకాడమీ ఛైర్మెన్ ఆర్.డి.విల్సన్‌తో కలిసి తెలుగువారి సమస్యలపై చర్చించారు. తొలుత ఆయన డిసెంబరు 15వ తేదీ అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో జరిగిన అమరజీవి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ తెలుగు-సంస్కృత అకాడమీ ఛైర్మెన్ ఆర్.డి.విల్సన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమైక్య భారతికి చెందిన పి. కన్నయ్య, టామ్స్ డాక్టర్ జి. ఇజ్రాయెల్, ప్రభుత్వ అదనపు కార్యదర్శి జి.సి. నాగూర్, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ కె. అనిల్‌కుమార్‌రెడ్డి మరియు స్మారక భవన కమిటీకి చెందిన ఇతర సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మరుసటి రోజు 16వ తేదీన విల్సన్, ఇజ్రాయెల్‌తో కలిసి ప్రొఫెసర్ సి.ఎం.కె.ఆర్ నివాసానికి వెళ్లి ఆచార్య సీఎంకే రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు తమిళనాడులో నివసిస్తున్న తెలుగువారి సమస్యలపై, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు.

## 'ఘంటసాల గానలహరి'



చంద్రతేజాలయ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఘంటసాల జయంతి కార్యక్రమం 17వతేదీ బుధవారం నెల్లూరు పురమందిరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సుప్రసిద్ధ సినీ నేపథ్య గాయకుడు చంద్రతేజ, గాయనీమణి శ్రీమతి శివలీల ఘంటసాల గానలహరితో సభికులని అలరించారు. 'ఓ పాట..ఓ పద్యం' పేరుతో జరిగిన ఈ జయంతిలో చంద్రతేజ తన పద్యాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా గాయకులు పాటూరు శ్రీనివాసులు, డాక్టర్ మనోహర్‌బాబు, మ్యుజిషియన్ ప్రభుదాస్, యాంకర్ మురళిలను 'లాయర్' పత్రిక సంపాదకులు శివప్రభాత్‌రెడ్డి సత్కరించారు. శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు, మన నెల్లూరీయులు డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి ఆశీస్సులతో ఈ వేడుక జరిగింది.

# 'ఇఫ్కో' అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్

## ఎట్టకేలకు మంత్రిమండలి ఆమోదం

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇఫ్కో అభివృద్ధికి ఎట్టకేలకు మంత్రి మండలి నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించింది. నెల్లూరు జిల్లా రాచర్లపాడు గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ఇఫ్కో కిసాన్ ప్రత్యేక ఆర్థిక మండలికి ఇటీవల జరిగిన మంత్రి మండలిలో ఆమోదం లభించినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఓ ప్రకటనలో తెలిపారు. కిసాన్ ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటుతో నెల్లూరు జిల్లాలో పారిశ్రామిక పురోగతికి నూతన శకం ఆరంభమైనట్లేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఇఫ్కో సెజ్ నెల్లూరుజిల్లాలో 2,776 ఎకరాల్లో మల్టీ ప్రొడక్ట్ స్పెషల్ ఎకనామిక్ జోన్‌ను అభివృద్ధి చేస్తోందన్నారు. ఈ ప్రాజెక్టులో మొత్తం రూ.870 కోట్ల పెట్టుబడులతో మౌలిక వసతులు కల్పించనున్నారన్నారు. తద్వారా సుమారు 70వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు ప్రోత్సాహకాలను అందిస్తోందని, ఇప్పటికే మూడు ప్రధాన సంస్థలు అక్కడ పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయని తెలిపారు. ఇది పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే కావలి-నెల్లూరు మధ్య ఇదొక కీలక ఆర్థిక కారిడార్‌గా మారనుందని కలెక్టర్ వివరించారు.

# విద్యుత్‌ని పొదుపుగా వాడుకోవాలి

విద్యుత్‌ని వృధా చేయొద్దని, పొదుపుగా వాడుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు చెప్పారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఇటీవల జిల్లా విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. నెల్లూరులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీకి జేసీ జెండా వూపి ప్రారంభించారు. విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ కె.రాఘువేంద్రం, ఇఇ శేషాద్రి బాలచంద్ర, శ్రీధర్, డీఇఇ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంధన పొదుపుపై విద్యార్థులకు అవగాహన కలిగించారు.


# 'గర్భ సంస్కార్'.. ఓ విశిష్ట కార్యక్రమం



'గర్భ సంస్కార్' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇస్కాన్ ఆలయ నిర్వాహకులు శుకదేవస్వామి

తల్లి గర్భంలోనే బిడ్డలకు మంచి విషయాలు తెలియజేసే గర్భ సంస్కార్ ఓ విశిష్ట కార్యక్రమమని, దీనివల్ల తల్లి సుఖంగా కాన్పు అవడమే కాకుండా, పుట్టబోయే బిడ్డలు గొప్ప వ్యక్తులుగా తయారయ్యేందుకు అవకాశం ఉంటుందని సింహపురి వైద్య సేవా సమితి వైస్ ఛైర్మెన్ బాలు సుబ్బారావు చెప్పారు. ఈనెల 15న నెల్లూరులోని జయభారతి ఆసుపత్రి ప్రాంగణంలో గర్భిణీ స్త్రీలకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలకు జీవనశైలిలో ఆహార నియమాలు, మానసిక వికాసం, మంత్రచారణ, ఆసనాలు, పుట్టబోయే బిడ్డతో అనుబంధం తదితర అనేక అంశాలలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. 'ఇస్కాన్' ఆలయ నిర్వాహకులు శ్రీ శుకదేవస్వామి మాట్లాడుతూ, పురాణకాలంలో భక్త ప్రహ్లాదుడు, అభిమన్యుడు వంటివారు తల్లి గర్భంలో ఉండగానే అనేక విషయాలు తల్లి ద్వారా ఆలకించి, నిజజీవితంలో ఉత్తమంగా రాణించారని, జయభారత్ ఆసుపత్రివారు అలాంటి మంచి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆరునెలల ప్రాయం నుంచే బిడ్డలు తల్లులు చెప్పే విషయాలు బాగా ఆలకిస్తారని ప్రముఖ చిన్నపిల్లల వైద్యురాలు వెన్నెల తెలిపారు. ప్రతి తల్లి..గర్భంలో ఉన్న తన బిడ్డ కోసం సంగీతం, కథలు, మంచిమాటలు వినాలని, అందువల్ల బిడ్డ ఆరోగ్యంగా పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ, ప్రసవం తర్వాత బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింహపురి వైద్య సేవ సమితి కోశాధికారి గుర్రం సుధాకర్, జయభారత్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్, భగవాన్ మహావీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జేపీ జైన్, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తాత్వికతే ఊపిరిగా.. 'రెప్పవాలని రాత్రి'

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షులుగా పనిచేశారు. ప్రస్తుతం ప్రాచీన విశిష్ట తెలుగు అధ్యయన కేంద్రం సంచాలకులుగా వున్నారు. ఒక ఉన్నతాధికారిగా తెలుగు భాషా సాహిత్యాలకు సేవలందిస్తూనే మరొకపక్క సృజన రంగంలోనూ విశేషంగా కృషి చేస్తూవున్నారు. ఇప్పటికి 8 కవితా సంకలనాలు వెలువరించారు. తమిళ, హిందీ, ఇంగ్లీషు భాషల నుంచి అనేక కవితలను అనువాదం చేశారు. ఇది తొమ్మిదవ కవితా సంకలనం.



రచయిత:
మాడభూషి సంపత్‌కుమార్
సెల్: 9444075128
వెల: రూ. 150/- పేజీలు: 82
ప్రతులకు: పాలపిట్ట బుక్స్
విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్,
మలక్‌పేట, హైదరాబాదు - 36.

'రెప్పవాలని రాత్రి'లో 40 కవితలున్నాయి. ఈ 40కవితలు మన హృదయాలను తట్టిలేపడమే గాక ఆలోచింపజేస్తాయి. మనలో దాగివున్న అంతర్గత చైతన్యానికి ఊపిరిలూదుతాయి.

'ధ్యానం' అనే కవితలో "తోటను కొట్టేసి / కుండీలో మొక్కలు పెంచుతున్నాం / చెరువును మూసేసి / తొట్టెలో చెపల్ని పెంచుతున్నాం / బావిని పూడ్చేసి / లారీ నీళ్ళ కోసం ఎదురుచూస్తున్నాం / మనసును మూసేసి / మోక్షం కోసం ధ్యానం చేస్తున్నాం" - ఆధునిక మానవుని వింత చేష్టల్ని, మరుగుజ్జు ఆలోచనలను కవి పైవిధంగా వ్యక్తీకరించారు.

'స్వేచ్ఛ కోసం / గాలి ప్రయత్నిస్తే / శరీరంలో నుంచి ఎప్పుడో వెళ్లిపోయేవి' అంటారు స్వేచ్ఛ అనే కవితలో - మనిషి తత్త్వాన్ని తెలుపుతూ, స్వేచ్ఛ అనే దానికి పరిధులు ఎలా విధించుకోవాలో కవితాత్మకంగా తెలిపారు మాడభూషి వారు.

అహింసతో బ్రిటీష్ వాడ్ని గెలవచ్చు / భారతీయుడ్ని కాదు / అంటారు 'అహింస' కవితలో. స్వాతంత్ర్యం ప్రకటించిన వెంటనే విభజన, ఆపై గాంధీ గుండెల్లో తూటా.. ఇక మనకు అహింసతో పనిలేదని రుజవు చేసుకున్నాం. చిన్న కవితలో పెద్ద అర్ధం.

'నువ్వు' అనే కవితలో - 'ఎప్పుడో యుగాలకు ముందు రాలిపడిన ఒక మట్టిముక్క ఈ భూమి. దీనిమీద పెత్తనం కోసం పోరాటమెందుకు? - అంటారు కవి. భూమ్మీద పుట్టి, భూమ్మీద పెరిగి భూమిలో కలిసిపోయే మూర్ఖుడా.. ఎందుకీ తాపత్రయం! ఏదీ నీతో తీసికెళ్లలేవు' అని సున్నితంగా చెప్తారు మాడభూషి వారు.

"అన్నం కుతకుతలాడుతోంది. నీ దోపిడికి నిరసనగా, నీ మీద ఆగ్రహంతో" అంటారు ఒకచోట 'అన్నం' అనే కవితలో- అంటే ఎవరో శ్రమ చేస్తే, ఎవరో వండి పెడితే ఎవరో తింటున్నారు. కవిత చిన్నదే కానీ దోపిడిని ఎండగట్టే కవిత -

"కవిత్వం" అన్న కవితలో 'వాల్మీకి, వ్యాసుడు / కాళిదాసు భారవి/నన్నయ, తిక్కన/ పెద్దన, వేమన / శ్రీశ్రీ గద్దర్ మరణిస్తారు / మరణించనిది కవిత్వమొక్కటే / కవిత్వం మరణించినవాళ్ళను బతికిస్తుంది / జీవించి ఉన్నవాళ్లను ఉజ్జీవింపజేస్తుంది / జీవచ్ఛవంగా ఉన్నవాళ్లను ఉద్దీపింపజేస్తుంది" - అంటూ కవిత్వం యొక్క శాశ్వతత్వాన్ని చిన్నచిన్న పదాలతో కవి వ్యక్తీకరించారు.

కొన్ని కవితల్లో తాత్వికత గుభాళిస్తుంది. "సున్న" అనే కవితలో - "తెచ్చింది సున్న / తీసుకెళ్లేది గుండు సున్న / మోస్తున్నదంతా మోతే / చివరకు అంతా కోతే / మానవత్వమే మిగిలేది / మనిషితత్త్వమే గెలిచేది / అంటారు సంపత్‌కుమార్.

యుద్ధ బీభత్సాన్ని 'రెప్పవాలని రాత్రి'లో వర్ణించారు. శాంతి కాముకత్వాన్ని మనసారా కోరుకున్నారు కవి. 'రాత్రంతా రెప్పవాలకుండానే గడిచిపోయింది / ప్రాణాలు వాయులీనమైనా / కళ్లు తెరుచుకునే వున్నాయి / యుద్ధం ఎప్పుడు సమాప్తమయిందో తెలియదు / రెప్పవాల్చకుండా ఎదురుచూసినా / బాంబులు ఎప్పుడు పడ్డాయో తెలియదు / భవనం ఎప్పుడు కూలిందో తెలియదు / రెప్పడకుండానే తల పడిపోయింది / రాత్రంతా అవిశ్రాంతంగా ఎదురుచూసిన కళ్లు / ఇంకా తెరుచుకునే వున్నాయి / రెప్పవాలకుండానే దీపం ఆరిపోయింది /... ఇలా ప్రతి కవితా 'అల్పాక్షరములతో అనల్పార్ధ రచన'ను గుర్తు చేస్తుంది. మాడభూషి వారు అత్యంత మానవత కలిగిన మానవీయ కవి. ఆయన పదాలే ఆయన ఆయుధాలు. అవి అన్యాయాన్ని చీల్చి చెండాడుతాయి. నిజాల్ని నిర్భయంగా బయటపెడతాయి. అందుకే ఆయన లెక్కకు మించి సత్కారాలు, బిరుదులు అందుకున్నారు. ఆయన కలం నుండి మరిన్ని కవితా సంకలనాలు వెలువడాలని కోరుకుంటూ వారికి అభినందనలు.



డా. గంగిశెట్టి శివకుమార్
సెల్ : 94418 95343

# టూకీగా...



## కొడవలూరులో రాయితీతో పశువుల మేత

కొడవలూరులోని పశువైద్య కేంద్రంలోఈనెల 16న సబ్సిడీతో రైతులకు పశువుల మేతను పంపిణీ చేశారు. 1100 రూపాయలు విలువచేసే దాణాని 550 రూపాయలకు అందజేశారు. వెటర్నరీ అసిస్టెంట్ సిహెచ్ అశోక్, ఎన్. రమణయ్య, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసులు, స్థానిక నాయకులు వెంకీ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## నిడిగుంటపాళెంలో వన మహోత్సవం

వెంకటాచలం మండలం నిగుంటపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఈనెల 16న చౌటపాళెం సొసైటీ ఛైర్మెన్ రావూరు రాధాకృష్ణమనాయుడు ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. తొలుత విద్యార్థులతో ర్యాలీ చేసి, పాఠశాలలో మొక్కలు నాటారు. కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, చల్లా నాగార్జునరెరడ్డి, కుంచి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పాత జంగాలపల్లిలో గ్రామసభ

ఆత్మకూరు మండలం నువ్వురుపాడు పంచాయతీలోని పాత జంగాలపల్లి గ్రామంలో ఈనెల 16న గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ పద్మజ ఆధ్వర్యంలో గ్రామ సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. గ్రామంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషిచేశారు. స్థానిక టీడీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, ఖాజావళి, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

## చౌకచర్లలో 'పొలం పిలుస్తోంది'

విడవలూరు వ్యవసాయ అధికారిణి పీహెచ్‌ఎస్ లక్ష్మి ఆధ్వర్యంలో ఈనెల 16న మండలంలోని చౌకచర్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు సూచనలు సలహాలు అందజేశారు. పొలాలకి జింక్ లోపం ఉన్న రైతులు జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయా లని సూచించారు. వీఏఏ కవిత, చాద్విక పాల్గొన్నారు.

## ముసునూరులో బాల్యవివాహాలపై అవగాహన

కావలి సమీపంలోని ముసునూరు ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఈనెల 16న బాల్యవివాహాల వల్ల కలిగే అనర్ధాలపై బాలికలకు అవగాహన కలిగించారు. బాల్యవివాహాలు చేసుకోరాదని, అలా చేసుకోవడం చట్టప్రకారం నేరమని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్వాయపాళెంలో విద్యార్థులకు క్లాస్‌పీకిన ఎస్ఐ

విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలను వాడకూడదని, వాటివల్ల జీవితాలే నాశనం అవుతాయని కావలి రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి సర్వాయపాళెంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఈనెల 16న క్లాస్ పీకారు. వ్యసనాల బారిన పడకుండా బాగా చదువుకోవాలని చెప్పారు. ప్రిన్సిపాల్ తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## గూడూరు వద్ద రోడ్డుప్రమాదం.. వృద్ధుని దుర్మరణం

చిల్లకూరు మండలం ఓడూరు గ్రామానికి చెందిన మణి (64) ఇటీవల గూడూరు సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. నెల్లూరు నుంచి ఓడూరుకి ద్విచక్ర వాహనంలో వస్తుండగా మార్గమధ్యంలో ఈ ప్రమాదం జరిగింది. గూడూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పంటపాళెంలో స్వామిత్ర సర్వేపై సభ

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన స్వామిత్ర సర్వేకి అందరూ సహకరించాలంటూ ఈనెల 16న ముత్తుకూరు మండలంలోని పంటపాళెంలో జరిగిన సభలో సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సర్వేకి వచ్చిన అధికారులకు ప్రజలు తమ ఆధార్, రేషన్‌కార్డులు తదితర పత్రాలను చూపి వివరాలను తెలపాలని కోరారు.

## అనుమసముద్రంలో పేకాటరాయుళ్ల అరెస్ట్

ఏఎస్‌పేట మండలంలోని అనుమసముద్రం గ్రామ పొలాల్లో పేకాటాడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 10,600 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్‌పేట ఎస్ఐ సైదులు ఆధ్వర్యంలో, ఏఎస్ఐలు విక్రమ్‌రావు, భాస్కర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ఈ దాడులు నిర్వహించారు.

# తెలుగు మాటకి.. పాటకి..
# 'బాలూ' నిలువెత్తు ప్రతీక!



## • విగ్రహావిష్కరణ సభలో ప్రస్తుతించిన వెంకయ్య

**తెలుగు మాటకి, పాటకి బాలూ నిలువెత్తు ప్రతీక అని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చెప్పారు. ఇటీవల హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ది మ్యూజిక్ గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ నేపథ్యగాయకుడు, పద్మవిభూషణ్ శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం(ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం) కాంస్య విగ్రహాన్ని వెంకయ్య చేతులమీదుగా ఆవిష్కరించారు.**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని రవీంద్రభారతిలో ఘంటసాల విగ్రహం పక్కనే పెట్టడం సముచితమని, వారి కోరిక కూడా అదేనని ఆయన అన్నారు. బాలూ పరిపూర్ణ కళాకారుడని, వారు ఆలపించిన ప్రతి పాటా, ప్రతి రాగం ఒక భావ జలపాతమన్నారు. బాలూ స్నేహశీలి అని, నిత్యకృషీవలుడని, మృదు స్వభావి అని, గాయకునిగా–నటునిగా–దర్శకునిగా–వ్యాఖ్యాతగా ప్రేక్షకులకు ఆనందం పంచారని చెప్పారు. తెలుగు సంగీత ప్రపంచానికి ఘంటసాల–ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఇద్దరూ స్వర్ణయుగం తెచ్చారని ఆయన ప్రస్తుతించారు. గానగంధర్వుడు బాలూ...స్వర సార్వభౌముడంటూ వెంకయ్య కీర్తించారు. ఎంతో మంది నటుల నటనాశైలికి, హావభావాలకు, గాత్రధర్మానికి అనుగుణంగా పాటలు పాడే ప్రత్యేకత బాలూకి మాత్రమే సొంతమన్నారు. ఆయన గళం..ఒక అక్షయ పాత్ర లాంటిదని, సంగీత దర్శకుడు, గేయ రచయిత ఏది కోరుకుంటే అది పలికించే గళం.. బాలూకో వరం అనీ అన్నారు. సంగీతం అనేది సద్బుద్ధిని, సదాచారాన్ని, సద్భావన, సహృదయం ఇలా అన్నిటినీ కలుగజేస్తుందని, అలాంటి సంగీత స్వర సార్వభౌముడైన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నవతరానికి, యువతరానికి, రేపటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని ఆయన తెలిపారు. బాలసుబ్రమణ్యంలో ఒక గొప్ప వ్యక్తిత్వ వికాస నిపుణుడున్నారని, పాడుతా తీయగా వంటి కార్యక్రమాల్లో చిన్నారులను ఆయన ప్రోత్సహించడం.. వారికి జీవిత సత్యాలను బోధించే తీరు అద్భుతమన్నారు. పిల్లల్లో సంస్కార బీజాలు నాటేందుకు బాలూ చేసిన కృషి మార్గదర్శక మన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు పాల్గొన్నారు.



హైదరాబాదులోని రవీంద్రభారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు, పాల్గొన్న బాలు కుటుంబసభ్యులు

## పాట మాధుర్యం..మాట ఆత్మీయం!

**- 'పద్మభూషణ్' డా. కే.ఐ.వరప్రసాద్‌రెడ్డి**



ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న బాలూ చిరకాల మిత్రులు.. శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు 'పద్మభూషణ్' డా. కే.ఐ.వరప్రసాద్‌రెడ్డి గద్గద స్వరంతో మాట్లాడుతూ, తనకు మిత్రుడైన బాలూ ఇక లేడన్న నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నా న్నారు. బాలూ పాటెంత గొప్పదో ఆయన వ్యక్తిత్వం అంతకన్నా గొప్పదన్నారు. బాలూ పాట మాధుర్యమైతే, మాట ఆత్మీయ మన్నారు. 'పాటలు కవి హృదయంలో నుండి పుడతాయి, కానీ మాటలు మాట్లాడే వ్యక్తుల అంతరంగాలలో నుంచి వస్తాయి..' అని అన్నారు. ఆయనో 40వేల పాటలకు పైగానే పాడారు. మనకున్న సాంకేతికతతో ఆ పాటలు మళ్ళీ మళ్ళీ వినవచ్చు. కానీ, ఆయన మాటలు మాత్రం మనం మళ్ళీ మళ్ళీ వినాలంటే వినలేం కదా!.. అని ఆయన అన్నారు. అంతేకాదు, బాలూ వంటి వ్యక్తి శతాబ్దానికి ఏ ఒక్కరో పుడతారన్నారు. 'బాలూ మాటలు వినాలంటే ఆయన మళ్ళీ పుట్టాలి.. అలాంటి రోజు కోసం చూద్దాం'..అంటూ వరప్రసాద్‌రెడ్డి మాట్లాడిన మాటలు అందరి హృదయాలను తాకాయి. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యంతో ఉన్న స్నేహబంధాన్ని, ఆత్మీయ అనుబంధాన్ని వరప్రసాద్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు.

# దేశం సత్తాను చాటిన మహానేత.. వాజ్‌పేయి

## • బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



వాజ్‌పేయి విగ్రహం ఆవిష్కరించిన అనంతరం నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రులు ఆనం, సత్యకుమార్ తదితరులు

అణుపరీక్షలు, కార్గిల్ యుద్ధంతో దేశ సత్తాను చాటిన మహానేత వాజ్‌పేయి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ కొనియాడారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15న నెల్లూరులో వాజ్‌పేయి కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాజ్‌పేయి ప్రసంగాలు అద్భుతమని, రాజకీయాల్లోకి రావాలనుకునేవారు తప్పనిసరిగా స్ఫూర్తిదాయకమైన వాజ్‌పేయి ప్రసంగాలను వినాలని చెప్పారు. ఆ తర్వాత, కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దుచేసి, వాజ్‌పేయి ఆశయాన్ని ప్రధాని మోడీ నెరవేర్చారన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, చెన్నై–నెల్లూరు రహదారి శంకుస్థాపనకు మలేసియాకి చెందిన కాంట్రాక్టర్లను వాజ్‌పేయి తీసుకువచ్చారని తెలిపారు. ఇప్పుడు ప్రధాని మోడీ ఆశీస్సులతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల సారధ్యంలో రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందన్నారు. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఎంతో అభివృద్ధి జరుగుతోందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. దేశంలోని 23 ప్రాంతాల్లో మెడికల్ సైన్స్ సెంటర్లు, మహానగరాల్లో అనేక మెట్రో నిర్మాణాలు చేస్తూ దేశాన్ని ప్రధాని మోడీ ప్రగతిపథంలో పయనింపజేస్తున్నారని అన్నారు. ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్ రావు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్, డీవీ కృష్ణారెడ్డి, ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొని వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలను ప్రస్తుతించారు. తొలుత, అటల్–మోడీ సుపరిపాలన యాత్రలో భాగంగా నగరంలోని అయ్యప్పగుడి సెంటర్ నుంచి హరనాథపురం వరకు ర్యాలీ నిర్వహించారు.



వాజ్‌పేయి విగ్రహావిష్కరణలో జిల్లా నేతలు

## నెల్లూరీయులకి అందుబాటులో
# చెన్నై 'రెయిన్‌బో'



డాక్టర్ రమేష్ కంచర్ల

**పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటూ రెయిన్‌బో ఆసుపత్రి వ్యవస్థాపక ఛైర్మెన్ డాక్టర్ రమేష్ కంచర్ల నెల్లూరు జిల్లా ప్రజలకు విశేష సేవలందించేందుకు ముందుకు వచ్చారు. దేశంలోనే పేరెన్నికగన్న 'రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్' సేవలను నెల్లూరుకు కూడా అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, ఢిల్లీ,..ఇలా తూర్పు భారతదేశమంతా విస్తరించివున్న రెయిన్‌బో ఆసుపత్రి, ఇకనుంచి నెల్లూరు, గూడూరు తదితర ప్రాంతాల ప్రజలకు అత్యవసర రోగుల రవాణా సేవలను అందించనుంది.**

అంతేకాదు, అత్యున్నత నాణ్యత కలిగిన ఇంటెన్సివ్ కేర్, మరియు సూపర్‌స్పెషాలిటీ సేవలను ఈ ప్రాంతాల ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ఆ సేవలను నెల్లూరులో ప్రారంభించడం జరిగింది. దేశంలోని ప్రముఖ చిన్నపిల్లల ఆసుపత్రుల్లో రెయిన్‌బో ఒకటి అన్నది అందరికీ తెలిసిందే. మన పొరుగు రాష్ట్రమైన చెన్నైలోని గిండి, అన్నానగర్, షోలింగ నల్లూర్‌లలో ఈ ఆసుపత్రి శాఖలు ఉన్నాయి. తల్లీ బిడ్డల సంరక్షణలో పేరెన్నికగన్న ఈ ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన వైద్యులు, పలువురు ప్రఖ్యాతిచెందిన వైద్యనిపుణులు, వైద్యసిబ్బంది ఉన్నారు. ఈ నేపథ్యంలో, తమ స్వస్థలమైన నెల్లూరుజిల్లా ప్రజలు వైద్యం కోసం దూరప్రాంతాలకు ఎంతో వ్యయప్రయాసలు పడి వెళ్ళకుండా, వారికి అందుబాటులోనే వైద్యం అందించాలనే ఆశయంతో డాక్టర్ రమేష్ కంచర్ల 'రెయిన్‌బో' సేవలను విస్తరించారు. నవజాత శిశువుల కోసం ప్రత్యేక ఇంటెన్సివ్ కేర్‌తో పిల్లల సురక్షిత రవాణా కోసం ఐసీయు కన్సల్టెంట్లు, అనుభవజ్ఞులైన నర్సులు సిబ్బందిని ఏర్పాటుచేశారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న పిల్లలను సురక్షితంగా చెన్నైకి తరలించేదుకు అన్ని ఏర్పాట్లు ఉన్నాయి. పీడియాట్రిక్ క్రిటికల్ కేర్, నియోనాటాలజీ, పీడియాట్రిక్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, పీడియాట్రిక్ న్యూరాలజీ, పల్మనాలజీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ వంటి పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీలలో రెయిన్‌బో సమగ్ర సంప్రదింపులను అందిస్తుంది కూడా.

రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ – నెల్లూరు పిల్లల స్పెషాలిటీ ఆసుపత్రిగా, నెల్లూరులోని అన్ని మెటర్నిటీ ఆసుపత్రులు, పీడియాట్రిక్ ఆసుపత్రులతో అనుసంధానం కలిగి, వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా కూడా మద్దతునిస్తుంది. నెల్లూరులోని పీడియాట్రిక్ బృందాలు మరియు ప్రసూతి వైద్య బృందాలు రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్ మరియు బర్త్‌రైట్ బై రెయిన్‌బోలోని బృందాల మధ్య సంప్రదింపులను గణనీయంగా మెరుగుపరచడం తమ లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అన్నికాలల సేవలు రెయిన్‌బోలో ఉండడం నెల్లూరీయులకు ఒక గొప్ప సదవకాశమేనని చెప్పాలి. ఏదేమైనా, నెల్లూరీయులైన డాక్టర్ రమేష్ కంచర్ల నెల్లూరుపై ఉన్న అభిమానంతో ఈ ఆసుపత్రి సేవలను నెల్లూరు–గూడూరు తదితర ప్రాంతాల ప్రజలకు కూడా విస్తరిస్తుండడం విశేషం. ఈ సేవలను జిల్లా ప్రజానీకం సద్వినియోగం చేసుకుంటారని ఆశిద్దాం!...

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com